ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 25 నవంబరు 2025 | 5

సుబ్రహ్మణ్య షష్ఠికి ముస్తాబు
• ప్రముఖ ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి 6


కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌కు 166 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 166 అర్జీలు వచ్చాయి. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు రెవెన్యూ విభాగానికి సంబంధించి 79 అర్జీలు, పంచాయితీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధికి 29, మున్సిపల్ శాఖకు 10, హోంశాఖకు 9, వ్యవసాయశాఖకు 7, పాఠశాల విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ, పౌరసరఫరాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పరిశ్రమల శాఖలకు 32 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు బదలాయించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 36 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 36 అర్జీలను అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. వారి సమక్షంలోనే ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా తగిన ఆదేశాలు జారీ చేశారు. చట్టపరిధిలో వెంటనే ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు.



కలెక్టరేట్‌లో సమీక్ష చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్. పక్కన మంత్రి దుర్గేష్, కలెక్టర్ కీర్తి చేకూరి

24 గంటల్లోపే ధాన్యం సొమ్ము చెల్లింపులు జరగాలి

- వాతావరణ మార్పుల నేపథ్యంలో 27 నాటికి అదనపు వాహనాలు సిద్ధం చేయాలి
- ధాన్యం సేకరణపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష

రాజమహేంద్రవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి సంభవించే వాతావరణ మార్పుల నేపథ్యంలో అదనపు వాహనాలు సిద్ధంచేయాలని, రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్‌తో కలసి స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం సాయంకాలం ఖరీఫ్ ధాన్యం సేకరణ, పౌరసరఫరాల శాఖ పనితీరు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోపే సొమ్ము రైతు ఖాతాల్లో జమ కావాలన్నారు. ఎక్కడైనా ఆలస్యమైతే అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో 2,237 రవాణా వాహనాలు సిద్ధంగా ఉన్నాయని, రాబోయే మూడు రోజుల్లో వాతావరణ మార్పుల వచ్చే అవకాశం ఉన్నందున రవాణా, కొలతలు, నిల్వల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో జిల్లాలో 94.79శాతం పూర్తి చేసి ముందజలో ఉన్నారని, మిగిలిన కార్డులు కూడా మన మిత్ర యాప్ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 6.54 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచిందని, గత ఏడాదికంటే రెండున్నర రెట్లు ఎక్కువ సన్నద్ధం చేసినట్టు ఆయన చెప్పారు. రైతుల పంట రోడ్ల మీద ఎక్కడా నిల్వ ఉంచకుండా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. రైతుల్లో అభద్రతాభావం లేకుండా చూడాలని, కొంతమంది దళారులు వాతావరణ మార్పులను సాకుగా చూపి తక్కువ ధరకే కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారు. రూ.400 వరకూ తక్కువకు కొనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసిందని, ఎవరూ అలా చేయవద్దని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 1.35 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 24 నుంచి 48 గంటలలోపు రూ.240 కోట్లు జమచేసినట్టు చెప్పారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వ్యవసాయాధారిత జిల్లాగా ఉన్న తూర్పుగోదావరిలో గతేడాది 2.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే, ఈసారి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్టు చెప్పారు. రైతులకు అందించే టార్పాన్లు, గోనె సంచులు నాణ్యతపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో ధాన్యం సేకరణ విజయవంతంగా సాగుతోందన్నారు. వర్ష సూచనల నేపథ్యంలో రవాణా, నిల్వ, గోనె సంచులు పంపిణీ, మిల్లర్ల సన్నద్ధతపై ప్రత్యేక మానిటరింగ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో టి.సీతారామూర్తి, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బి.గణేష్, డీఎస్‌వో వి.పార్వతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్ పాల్గొన్నారు. కాగా కొవ్వూరులోని దొమ్మేరు, చాగల్లులో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మంత్రి మనోహర్ మరో మంత్రి దుర్గేష్‌తో కలిసి పరిశీలించారు.


కొవ్వూరు మండలం దొమ్మేరు లేఅవుట్‌లో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు



'దారి'కి తెస్తున్నారు!

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా మారిన రహదారులకు మంచిరోజులు వస్తున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో రహదారుల దారుణ దుస్థితిపై వచ్చిన కథనాల నేపథ్యంలో డిసెంబరు నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వచ్చే నెలలోగా మొత్తం రూ.110కోట్లకుపైగా నిధులు వెచ్చించి రహదారులను దారికి తేవడానికి సిద్ధమయ్యారు. తాజాగా ఉమ్మడి జిల్లాకు రూ.49.50 కోట్లు మంజూరవగా, వీటితో పలు కీలక రహదారులను రిపేర్లు చేయడానికి నిర్ణయించారు. త్వరలో వీటికి టెండర్లు పూర్తిచేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయబోతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- నరకప్రాయంగా మారిన రోడ్ల రిపేర్లకు రూ.49.50 కోట్లు మంజూరు
- కాకినాడ జిల్లాలో 7 రోడ్లకు 16.21కోట్లు, కోనసీమలో రూ.30 కోట్లు
- రాజమహేంద్రవరంలో కేశవరం -బొమ్మూరు రోడ్డుకు రూ.2.78 కోట్లు
- వీటికి టెండర్లు పూర్తయ్యాక మరో రూ.60 కోట్లతో మిగిలినవీ దారికి..
- 'ఆంధ్రజ్యోతి' కథనాల నేపథ్యంలో రోడ్ల మరమ్మతులకు సీఎం ఆదేశం

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో రహదారులు గోతులమయంగా మారాయి. అడుగుతీసి అడుగు వేయాలంటేనే నరకప్రాయంగా మారాయి. ఏటా వర్షాలు, వరదలతో పట్టణాల నుంచి గ్రామాల వరకు రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. అయితే వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్లపాటు వీటిని పూర్తిగా గాలికి వదిలేసింది. జనం గోతుల రహదారుల్లో ప్రయాణించి మృత్యువాత పడడం, తరచు గాయాలపాలవుతున్నా వైసీపీ ప్రభుత్వం ఏనాడూ కనీసం పట్టించుకోలేదు. ఆ తర్వాత గడచిన ఏడాదిన్నరలో కోనసీమలో భారీ వర్షాలు, మూడుసార్లు గోదావరి వరద, తుఫాన్లతో రోడ్లన్నీ మరింత దారుణంగా మారాయి. అటు తూర్పుగోదావరి జిల్లాలో భారీవర్షాలు, తుఫాన్ల ప్రభావంతో వందల కిలోమీటర్ల మేర రోడ్లు రూపురేఖలు కోల్పోయాయి. అలాగే కాకినాడ జిల్లాలోను భారీవర్షాలు, తుఫాన్లు, ఏలేరు వరదతో రోడ్లన్నీ వందల కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. అయితే వీటిని చాలావరకు ప్రభుత్వం మరమ్మతులు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది జనవరిలో సంక్రాంతి నాటికి రహదారుల కింద యుద్ధప్రాతిపదికన గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిన రోడ్లన్నింటినీ మరమ్మతులు చేసింది. ఒక్క కాకినాడ జిల్లాలో 119 రహదారులను రూ.31.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చింది. అలాగే కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో రూ.62కోట్లతో రిపేర్లు చేసింది. అయితే ఇవి చేయగా ఇంకా వందల కిలోమీటర్ల కొద్దీ రహదారులు మురమ్మతులకు నోచుకోలేదు. పైగా ఈలోపు ఈ ఏడాదిలో కురిసిన వర్షాలు, తుఫాన్ల ముప్పుతో ఆ రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కాకినాడ-సామర్లకోట రహదారిని రూ.1.50 కోట్లతోను, కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును రూ.80 లక్షలతోను, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోను అనేక రహదారులను మరమ్మతులు చేయగా, మళ్లీ దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అధ్వాన దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనాలు ప్రచురించింది. అటు రాష్ట్రవ్యాప్తంగాను అన్ని జిల్లాల్లో రోడ్ల దుస్థితిపై వెలువడిన కథనాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తక్షణం అన్నింటికి మరమ్మతు చేయాలని, డిసెంబరుకి ఎక్కడా రోడ్లపై గుంతలు కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వచ్చేనెల మొదట్లో రూ.49.50 కోట్లతో పలు రహదారుల మరమ్మతుకు ఆర్అండ్‌బీ సన్నద్ధమైంది.

ఆ జిల్లాలో రూ.30 కోట్లతో...

కోనసీమ జిల్లాలో ఇప్పటికే ఈ ఏడాది జనవరినాటికి పాట్ ఫ్రీ హోల్ కింద రూ.45 కోట్ల వరకు వెచ్చించి ప్రభుత్వం రహదారులను మరమ్మతు చేసింది. మిగిలిన రహదారులపైనా దృష్టిసారించింది. తాజాగా రూ.30 కోట్లతో 12 కీలక రహదారులను అద్దంలా మార్చబోతోంది. ముఖ్యంగా ముమ్మిడివరం-ముక్తేశ్వరం రహదారి మరమ్మతులకు రూ.1.67కోట్లు కేటాయించింది. ముమ్మిడివరం- కాట్రేనికోన ఐనాపురం రోడ్డుకు రూ.2.92కోట్లు, రాజవరం- పొదలాడ రూ.3.11కోట్లు, ఉప్పలగుప్తం మండలంలో సిరిపల్లి-మునిపల్లి రహదారి మరమ్మతుకు రూ.2.28 కోట్లు, ఐ.పోలవరంలో మురమళ్ల-ఎదుర్లంక రోడ్డుకి రూ.40.22 లక్షలు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రూ.1.67 కోట్లు, కాకినాడ జిల్లాలో సర్పవరం జంక్షన్ నుంచి లైట్‌హౌస్ పేట రోడ్డుకు రూ.1.97కోట్లు, తుని ఎర్రకోనేరు నుంచి వేమవరం రోడ్డుకు రూ.3.01కోట్లు, కత్తిపూడి పామర్రు రోడ్డు గొల్లప్రోలు పరిధిలో రూ.3.16 కోట్లు, తుని కత్తిపూడి రోడ్డు రూ.2.54కోట్లు, గండేపల్లి మండలం తాళ్లూరు-ఎల్లమిల్లి రూ.1.59 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గం పరిధిలో నరసాపురపుపేట-కాట్రావులపల్లి రహదారికి రూ.1.60 కోట్లు, కాజులూరు మండలం శలపాక-కాజులూరు రహదారి మరమ్మతుకు రూ.2.34 కోట్లు వెరసి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.16.21 కోట్లు మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. అలాగే రాజమహేంద్రవరంలో కేశవరం వయా బొమ్మూరు రోడ్డు మరమ్మతుకు రూ.2.78 కోట్లు కేటాయించింది. వీటన్నింటికి ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవగా, వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభించి రహదారులను తీర్చిదిద్దడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. అలాగే ఇవి పూర్తయ్యేలోగా మరో రూ.60 కోట్లతో ఉమ్మడి జిల్లాలో తుఫాన్లు, వరదలు, భారీవర్షాలకు దెబ్బతిన్న మిగిలిన రహదారులను కూడా మరమ్మతు చేయనున్నారు. వీటిలో ఒక్క కాకినాడ జిల్లాలోనే మొంథా తుఫానుకు దెబ్బతిన్న రహదారులకు రూ.30 కోట్లకుపైగా నష్టం వాటిల్లగా వాటికి రిపేర్లు చేయనున్నారు. అలాగే ఇటీవల వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న కాకినాడ-సామర్లకోట రోడ్డుని ప్రభుత్వం రూ.2.50కోట్లతోను. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును అరకోటికిపైగా వెచ్చించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది.



గాయత్రీ ఇసుక ర్యాంపులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

హైకోర్టుకు నివేదిక ఇస్తామని వెల్లడి

రాజమహేంద్రవరం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం సమీపాన గోదావరిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న గాయత్రీ ర్యాంపును కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైన్స్ ఏడీ డి.ఫణీంద్రరెడ్డి, ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులతో కలసి ఆమె ఈ తనిఖీ నిర్వహించారు. గాయత్రీ 1, 3 ర్యాంపుల నిర్వహణ జరుగుతున్న స్థలం ఫారెస్ట్‌కు చెందినదని ఫారెస్ట్ అధికారులు, తమకే చెందినదని బొమ్మ ఆనందకుమార్ అనే వ్యక్తి మధ్య వివాదం నడుస్తోంది. అయినా అక్కడ ఇసుక లోడింగ్ ఆగకపోవడంతో ఆదివారం జేసీ అక్కడకు వెళ్లి ఇసుక లోడింగ్ ఆపేశారు. ఈ వివాదంలో హైకోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ ర్యాంపును పరిశీలించారు. అక్కడ ప్రస్తుతం ఇసుక లోడింగ్ ఎవరు చేస్తున్నారని ఆరా తీశారు. నీళ్ల నమిలిన అధికార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ కీర్తి అక్కడ సేకరించిన వివరాలు, ప్రస్తుత పరిస్థితిపై హైకోర్టుకు నివేదించనున్నట్టు సమాచారం.


విమానాశ్రయం వద్ద డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి దుర్గేష్, అధికారులు

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మంత్రి కందుల దుర్గేష్, పోలీసు అధికారులు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌లో ఘనస్వాగతం పలికారు. నిడదవోలు మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న డైమండ్ జూబ్లీ ఉత్సవాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మంత్రి దుర్గేష్ ప్రస్తావించారు. డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఎస్పీ నరసింహకిషోర్, నిడదవోలు మున్సిపాలిటీ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్ ఉన్నారు.

074 అనే కోడ్‌తో కూడిన బ్యాచ్ మందులు ఇక్కడ లేనేలేవు

డీపీఎంవో డాక్టర్ శ్రీవల్లి


యూపీహెచ్‌సీలో మందులు తనిఖీ చేస్తున్న డాక్టర్ శ్రీవల్లి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం నారాయణపురం యూపీహెచ్‌సీలో కాలంచెల్లిన మందులు రోగికి ఇచ్చారని సోషల్‌మీడియాలో పోస్టుకు సంబంధించి అసలిక్కడ 074 అనే కోడ్‌తో కూడిన బ్యాచ్ నెంబరు మందులు లేనేలేవని డీపీఎంవో డాక్టర్ శ్రీవల్లి తెలిపారు. సోమవారం ఉదయం ఈ యూపీహెచ్‌సీలో రికార్డులను, మందులను ఆమె తనిఖీ చేశారు. ట్విట్టర్‌లో పోస్టుచేసిన పేషెంట్ నూర్జాన్ అనే మహిళ అని గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవల్లీ మాట్లాడుతూ సెప్టెంబరు 6న నూర్జాన్ పీహెచ్‌సీకి వచ్చి చికిత్స చేయించుకుందని తెలిపారు. ఈ మహిళకు బీపీకి సంబంధించి మందులు నెలరోజులు ఇవ్వడం జరిగిందన్నారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా మీరు ట్యాబ్‌లెట్లు వేసుకోకపోతే నెలదాటాక వాటిని వినియోగించవద్దని చెప్పడం కూడా జరిగిందన్నారు. ఆ మందులు వినియోగించుకోకుండా రెండు నెలల తర్వాత సోషల్ మీడియాలో కాలంచెల్లిన మందులు పీహెచ్‌సీలో ఇచ్చారని పెట్టారని శ్రీవల్లి తెలిపారు. నూర్జాన్ మరొక మందు కూడా కాలం చెల్లిందని పెట్టిన 074 అనే కోడ్‌తో కూడిన బ్యాచ్ నెంబరు మందులు అస్సలు మనకు సరఫరా లేదన్నారు. విచారణ జరుగుతోందని, త్వరలో నిజానిజాలు తెలుస్తాయన్నారు. పీహెచ్‌సీల్లో నెలనెలా మందుల తనిఖీలు జరుగుతున్నాయని చెప్పారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో మందుల్లేవ్

- కాలదోషానికి దగ్గరైనవే పంపిణీ
- బయట కొనుక్కోలేక రోగుల తిప్పలు
- ఆరు నెలల నుంచీ ఇదే పరిస్థితి
- భవనం కొత్తది.. సదుపాయాలు పాతవే
- 3 ఫ్లోర్లలో ఒకటే వాడకం.. 2 ఖాళీ
- నిర్వహణ బాగోకపోతే రూ.56 కోట్లు వృథా
- గాడిలో పెట్టే కృషి చేయని ప్రజాప్రతినిధులు





(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా రాజమహేంద్రవరంలో కార్మిక ప్రభుత్వ బీమా వైద్యశాల (ఈఎస్ఐ ఆస్పత్రి) నూతన భవనం అందుబాటులోకి వచ్చిందని ఆ భవనాన్ని చూసి సంబరపడడం తప్ప ఆస్పత్రికి పట్టిన రుగ్మతలకు చికిత్స జరగడం లేదు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ మురళీ మోహన్ చొరవతో పునాది రాయి పడింది. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో పనులు నత్తనడకన సాగాయి. మూడేళ్ల ఆపసోపాల తర్వాత ఈ జూలైలో గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభమైనా పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందుబాటులోకి రాలేదు. ఈఎస్ఐ ఆస్పత్రికి రోజూ 120 వరకూ ఓపీ ఉంటుంది. ఈఎస్ఐలో కార్మికులు, వారి కుటుంబాలకు వైద్యం అందించాల్సి ఉంటుంది. ఈ కార్మికులు అందరూ రూ.20వేలలోపు వేతనం కలిగిన వాళ్లే ఉంటారు. దీంతో మందులు లేకపోవడంతో బయట కొనుక్కోవాల్సి వస్తోంది. డాక్టర్లు రాసిన మందుల్లో చాలా మటుకు అందుబాటులో ఉండకపోవడం వారికి తలపోటుగా మారింది. మందులు దాదాపుగా నిండుకొని ఆరు నెలలవుతోంది. ఇప్పుడు రూ.4కోట్ల విలువైన 200పైగా మందుల జాబితాతో ఇండెంట్ రెడీ చేశారు. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత వస్తే అదృష్టమనే చెప్పాలి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ఫార్మసీలో ఉన్న కొద్దిపాటి మందులనే పంపిణీ చేస్తున్నారు. వాటిలో చాలా వరకూ ఒకటి, రెండు నెలల్లో కాలదోషం పట్టేవే ఉంటున్నాయి. కనీసం కాల్షియం బిళ్లలు కూడా లేవంటే దుస్థితిని అర్థం చేసుకోవచ్చు.

● రూ.56 కోట్లు వృథానా..

ఆస్పత్రి నిర్మాణానికి రూ.97.98 కోట్లను 2020 ఆగస్టు 19న కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే 5.83 ఎకరాల విస్తీర్ణంలో రూ.56కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. ఆస్పత్రి జీ+2 ఫ్లోర్లతో 13376 చదరపు మీటర్లలో ఉండగా, మార్చురీ భవనం 77.40 చదరపు మీటర్లలో నిర్మించారు. వాస్తవానికి 2022 జూలై 10కి నిర్మాణం పూర్తి కావాల్సి ఉన్నా 2024 డిసెంబరు 30కి పూర్తయింది. ఆరు నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఈఎస్ఐ కార్పొరేషన్ బదిలీ చేసింది. క్యాజువాలిటీ ఆపరేషన్ థియేటర్, అగ్నిమాపక తలుపులు, ఐసీయూలు, యోగా గదితోసహా అన్ని గదులనూ ఔరా అనిపించే విధంగా నిర్మించారు. మహిళా శిశు వైద్య విభాగానికి ఏకంగా ఒక ఫ్లోర్‌నే కేటాయించారు. అన్ని రకాల వైద్య సదుపాయాలకు ఏర్పాట్లు కల్పించారు. సెకండరీ కేర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, ఆర్థో, ట్రామా కేర్‌తోసహా 26 రకాల వైద్య సేవలను అందించే విధంగా నిర్మాణాలు ఉన్నాయి. సెంట్రల్ ఏసీ సదుపాయంతోపాటు భద్రతకు 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులోని ప్రతి మంచం వద్ద ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం ఉంది. కాకపోతే మంచాలే ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. ఆపరేషన్ థియేటర్లు అత్యంత విశాలంగా ఉండి యంత్రాల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ ఆస్పత్రి పరిధిలో రాజమండ్రి, సీతంపేట, లాలాచెరువు, ఇన్నీసుపేట, కడియం, ధవళేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం,తణుకు, భీమవరం, వేంద్ర డిస్పెన్సరీలు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోరులో 32 గదుల్లో ఓపీ, వ్యాధి నిర్ధారణ, ఈసీజీ, ఎక్స్‌రే, క్యాజువాలిటీ, క్యాజువాలిటీ ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, క్యాంటీన్, లాండ్రి, ఆయుర్వేద, హోమియో, ఎమర్జెన్సీ వార్డు, ఫిజియోథెరపీ తదితర సేవలు ఉంటాయి. రెండో ఫ్లోరును పూర్తిగా మాతా శిశువుల కోసం కేటాయించారు. వారికి సంబంధించిన అన్ని వైద్య సదుపాయాలనూ ఏర్పాటు చేస్తున్నారు. ఐసీయూ, పీఐసీయూ, హెచ్‌డీయూ, ఎన్ఐసీయూ, ఎస్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ప్రొసీజర్ రూమ్స్, లాకర్లు ఇలా 26 రూములు నిర్మించారు. మూడో ఫ్లోరులో 12 పడకల చొప్పున 6 వార్డులుండగా.. పురుషులకు, మహిళలకు విడివిడిగా విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. వార్డుల్లో సైతం ఆక్సిజన్, వెంటిలేటర్, వంటి సదుపాయాన్ని కల్పించారు. ఇదే ఫ్లోరులో లైబ్రరీ, బ్లడ్ స్టోరేజీ, ఎంఆర్‌డీ, పరిపాలన గదులు ఉన్నాయి. ఆస్పత్రి భవనంలో ప్రస్తుతం ఒక్క ఫ్లోరు మాత్రమే వినియోగంలోకి వచ్చింది. రెండో ఫ్లోరులో సూపరింటెండెంట్ గదిని మాత్రమే వాడుతుండగా మిగతా ఫ్లోర్లు, గదులు.. రోగులు, సిబ్బంది, వైద్య పరికరాల కోసం ఎదురు చూస్తున్నాయి. వైద్యులు, సిబ్బందికి నివాసాలను కూడా ఆస్పత్రి ప్రాంగణంలోనే నిర్మించారు. నిర్వహణ గాడిలో పడకపోతే కోట్లు వృథా అయినట్టేనని భావించాల్సి వస్తుంది.

● స్టాఫ్‌ని నియమిస్తేనే..

ఈ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్, పరిపాలన కలిపి 30 మంది ఉన్నారు. కానీ 100 మందికిపైగా ఉండాలి. స్వచ్ఛ భారత్‌ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుండగా.. ఈ ఆస్పత్రిని హౌస్ కీపింగ్ స్టాఫ్ సరిపడా లేకుండానే పరిశుభ్రతను నెట్టు కొస్తున్నారు. కొత్త భవనంలోకి ఆస్పత్రి కార్యకలాపాలు మారిన తర్వాత 12 మంది పారిశుధ్య సిబ్బందిని, ఆరుగురు సెక్యూరిటీని మాత్రమే ఇచ్చారు. మూడుకుపైగా ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర వైద్య విభాగాలు ఉండడంతో షిఫ్టుల వారీగా పనిచేయాల్సి వస్తుంది. అందువల్ల 100 మంది వరకూ డాక్టర్లు ఉండాలి. హౌస్ కీపింగ్ సిబ్బంది 200 మంది వరకూ అవసరం అవుతుంది. కానీ సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.

సుబ్రహ్మణ్య షష్ఠికి ముస్తాబు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి, ఆలవెల్లి మల్లవరంల్లో విస్తృత ఏర్పాట్లు

స్వయంభూ ఆలయాల్లో రాత్రిపూట నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మకం



తాటిపర్తిలో స్వామి నిజరూప దర్శనం

(గొల్లప్రోలు రూరల్-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్వయంభూగా వెలిశారు. ఇక్కడ స్వామి వారి విగ్రహం వద్ద పాము కొంతకాలంగా పాటు ఉండి అక్కడే చనిపోవడంతో ఆ స్థానంలో ఆలయాన్ని నిర్మించారు. ఇక్కడికి సమీపంలోనే అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఆలయం ఉండడంతో మరింత ప్రాశస్త్యం లభించింది. సంతాన ప్రాప్తికి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో ఎరుపు రంగు చారల చీర కట్టుకుని రాత్రంతా నిద్రిస్తే మంచిదని భక్తుల నమ్మకం. ఇక్కడ ఉన్న పాము పుట్ట 88 సంవత్సరాలుగా పూజలు అందుకుంటోంది.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

తాటిపర్తిలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 88వ షష్ఠి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమై వచ్చే నెల ఒకటో తేదీ వరకు జరుగుతాయి. బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఉదయం 7 గంటల నుంచి సర్వదర్శనం, రాత్రి శూలాల సంబరం, చెట్టు భజన, తాడిపెద్దు సంబరం జరుగుతాయి. అనంతరం స్వామి కల్యాణం జరుగుతుంది. 30న మయూర వాహనంపై స్వామి గ్రామోత్సవం, డిసెంబరు 1న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షట్ సహస్ర నామార్చన, రాత్రి అపర్ణ పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం, శ్రీపుష్ప యాగం జరుగుతాయి.



సుబ్రహ్మణ్యేశ్వరుడే ప్రత్యక్షంగా వెలసిన క్షేత్రం

ఆలవెల్లి మల్లవరం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా దర్శనమిచ్చిన క్షేత్రమిది. సర్పరూపంలో భక్తులకు దర్శనమిచ్చినచోటే ఆలయాన్ని నిర్మించారు. 1961-64 సంవత్సరాల మధ్య ఆలవెల్లి మల్లవరంలోని పంట పొలాల్లో సర్పం రైతులకు కనిపించింది. కదలకుండా అక్కడే ఉండిపోయింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తమకు ప్రత్యక్షంగా కనిపించాడని భావించిన ప్రజలు పూజలు నిర్వహించడంతో అక్కడే ఆలయం నిర్మించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యక్షంగా వెలిశాడనే సమాచారం తెలియడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చేవారు. వారి కోసం అప్పట్లో మల్లవరం రైల్వేగేటు వద్ద ప్రత్యేకంగా హాల్టు ఇవ్వడంతో పాటు స్టేషన్ నిర్మించారు. మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వంటి ప్రముఖులు ఈ ఆలయాన్ని సందర్శించారు. సంతాన ప్రాప్తికి, కుజ దోష నివారణకు ఆలయ ఆవరణలో నిద్రిస్తే మంచిదని భక్తులు నమ్ముతారు.



కార్యక్రమాలు: వీరచోళ చతుర్వేద మండలం ఆలవెల్లి నిలయ మల్లవరం క్షేత్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. బుధవారం ఉదయం స్వామికి అభిషేకాలు, షష్ఠి స్నానాలు, మహా రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి కల్యాణం జరుగుతాయి. 27న స్వామికి క్షీరాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రాత్రి కోలాటం, 28న స్వామికి మహా రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, రాత్రి తెప్పోత్సవం, 29న క్షీరాభిషేకం, కుంకుమ పూజలు, నెమలి వాహనంపై గ్రామోత్సవం, 30న హనుమత్ పూజ, శ్రీపుష్పయాగం అనంతరం నృత్య ప్రదర్శనలు జరుగుతాయి. ఈ నెల 27వ తేదీ రాత్రి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన సంతాన శయన మందిరాన్ని ప్రముఖ ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ప్రారంభించనున్నారు. అనంతరం ఆయన ప్రవచనం జరుగుతుంది. షష్ఠి ఉత్సవాల్లో భక్తులు అధికంగా పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని తాటిపర్తి, మల్లవరం ఆలయాల కమిటీల ప్రతినిధులు కోరారు.

శరణు శరణు సుబ్రహ్మణ్య

తూర్పు గోదావరి జిల్లా అనపర్తి వీర్రాజుమామిడిలో కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి

మాలధారణ చేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



(అనపర్తి-ఆంధ్రజ్యోతి)

తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని వీర్రాజుమామిడి వద్ద వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. అనపర్తి నుంచి ద్వారపూడి వైపు వెళ్లే ఎర్ర కాలువ కుడి గట్టుపై వీర్రాజు అనే రైతు మామిడి మొక్క నాటాడు. అది పెరిగి పెద్దదై పది మందికీ నీడనిస్తూ వీర్రాజు మామిడిగా ప్రసిద్ధి చెందింది. మామిడి మొక్క సమీపంలోనే తేతలి బాపయ్య అనే మరో రైతు రావి మొక్క నాటాడు. అవి రెండూ దినదిన ప్రవర్ధ మానమై వృక్షాలుగా మారాయి. అయితే 1970 ప్రాంతంలో అక్కడ వ్యవసాయం నిర్వహించే కొత్తూరుకు చెందిన రైతు చెట్ల తొర్రల్లో పాములు నివాసం ఉండడం గుర్తించి వాటికి పాలుపోయడం ప్రారంభించాడు. తాను పెట్టిన పాలు మరుసటి రోజుకు మాయమవుతుండడంతో.. వాటిని పాములు సేవిస్తున్నాయా, మరో ఇతర జంతువులు తాగుతున్నాయో తెలుసుకునేందుకు అక్కడ కాలువలోని ఇసుకను తీసి పరుపులా పరిచి పరీక్షించాడు. చివరకు ప్రతిరోజూ చెట్టు తొర్రలోకి పాములు వస్తున్నాయని గ్రహించి వాటికి పూజలు ప్రారంభించాడు. నాటి నుంచీ భక్తులు వచ్చి చెట్టు తొర్రలోని నాగేంద్రులకు పాలుపోసి పూజలు చేయడం మొదలుపెట్టారు. 1979లో స్వామివారు ఒక భక్తుడికి కలలో కనిపించిన విధంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఈ ఆలయం అభివృద్ధి చెందుతూ షష్ఠి ఉత్సవాలకు ప్రాధాన్యత సంతరించుకుంది.

వీర్రాజుమామిడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రతి మంగళవారం ప్రత్యేక పండ్ల రసాలతో ఆలయ అర్చకుడు చందు శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేస్తున్నారు. స్వామివారికి పూజలు చేసి మొక్కుకుంటే కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. విద్య, వివాహం, సంతానం, వ్యాపార అభివృద్ధి మొదలైన కోరికలను స్వామి వారు తీరుస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఇక్కడ ప్రతిఏటా నిర్వహించే షష్ఠి ఉత్సవాల్లో మాలధారణ జరుగుతుంది. 12 సంవత్సరాల క్రితం కోనసీమ జిల్లా ద్వారపూడిలో ఉన్న ఈ ఆచారాన్ని తెలుసుకున్న ఇక్కడి భక్తులు వారి సహాయ సహకారాలతో మాలధారణ గావించి పదకొండు రోజుల దీక్ష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. 12ఏళ్ల క్రితం కేవలం 28 మంది భక్తులతో ప్రారంభమైన మాలధారుల సంఖ్య నేడు 278 మందికి చేరుకుంది. అనేక మంది భక్తులు తమ కోరికలు నెరవేరిన వెంటనే వచ్చే షష్ఠి ఉత్సవాల్లో మాల ధరించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఉద్యోగం, వివాహం, సంతానం వంటి కోరికలు నెరవేరాయని అనేక మంది భక్తులు చెప్తుంటారు. ఎంతో నియమనిష్ఠలతో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం స్వామివారికి పూజలు చేసి కటిక నేలపై నిద్రిస్తారు.

సంతానం ప్రసాదించారు

నల్లమిల్లి నాగార్జునరెడ్డి, పీరా రామచంద్రపురం



సంతానం కోసం స్వామివారిని మొక్కుకున్నా. ఏడాదికి పుత్రుడు జన్మించాడు. నాటి నుంచి నేటి వరకు ప్రతిఏటా స్వామివారి మాల ధరించి పూజలు చేస్తున్నాను.

విద్యాభివృద్ధికి మొక్కుకున్నాను

తేతలి కార్తీక్‌రెడ్డి, అనపర్తి



విద్యాభివృద్ధి కోసం స్వామివారిని మొక్కుకుని మాల ధరించాను. ఐదేళ్లుగా మాలధారణ చేస్తున్నాను. స్వామికి పూజ చేయడం చాలా ఆనందంగా ఉంది.

స్వామి దయతో ఉద్యోగం సాధించాను

తమలంపూడి శ్రీసాయిరెడ్డి, అనపర్తి



ఉద్యోగం కోసం మొక్కుకుని మాల ధారణ చేశాను. స్వామి దయతో సంవత్సరంలోనే మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం సొంతంగా స్టార్టప్ కంపెనీ పెట్టి మరి కొంతమందికి ఉపాధి కల్పిస్తున్నాము. ప్రతిఏటా మాలధారణ చేస్తాను.

కోరిన కోర్కెలు తీర్చి... సంతానాన్ని ఇచ్చే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చి సంతానాన్ని ఇచ్చే కొంగు బంగా రంగా బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని భక్తులు ఆరాధిస్తారు. శతాబ్దాల చరిత్ర గల ఈ స్వామి షష్ఠి ఉత్సవాలను సుమారు వందేళ్లుగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని, 26న షష్ఠి తీర్థం జరుపుతామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి (వాసు) తెలిపారు.

ఆలయ చరిత్ర:

849-892 మధ్య (బిరుదాంకినవోలు) బిక్కవోలును రాజధానిగా చేసుకుని తూర్పు చాళుక్యులు పాలించారు. వీరిలో పెద్దవాడైన విజయాదిత్యుని తండ్రి నరేంద్ర మృగరాజు రాష్ట్ర కూటులతో యుద్ధం చేసి వారిని హతమార్చాడు. 108 యుద్ధాలు చేసి శత్రు సైన్యాలను తరిమికొట్టాడు. అనేక మందిని చంపడంతో హత్యా పాపం పోవడానికి 108 శివాలయాలను నిర్మించాడు. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా ఇక్కడ స్వామి విజయేశ్వరునిగా పేర్గాంచారు. బిక్కవోలు పరిసర ప్రాంతాల్లో నిర్మించిన 108 శివాలయాల్లో కొన్ని తురుష్కుల దాడిలో ధ్వంసం కాగా మరికొన్ని శిథిలమయ్యాయి. తూర్పు చాళుక్యుల చరిత్రకు సాక్ష్యాలుగా బిక్కవోలులో నేటికీ కొన్ని దేవాలయాలు చెక్కుచెదరకుండా వున్నాయి. మూడు ఆలయాలు గ్రామ సరిహద్దుల్లో ఉండగా, క్షేత్ర పాలకునిగా మహావిష్ణువు, లక్ష్మీదేవి ఆలయం వున్నాయి. గ్రామం మధ్యలో రాజరాజేశ్వర, గోలింగేశ్వర, చంద్రశేఖర దేవాలయాలు... మూడు ఒకే ప్రాంగణంలో ఉండడం విశేషం. పెద్దాపురం మహారాజు వత్సవాయి సూర్యనారాయణ తిమ్మ గజపతి గోలింగేశ్వర స్వామి ఆలయంలో కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించాడు. స్వామి పళనిలో వలె దక్షిణాభి ముఖాన దర్శనమిస్తాడు. స్వామి చెంతనే సహజమైన పుట్ట నేటికీ వుంది.



సహజ సిద్ధమైన పుట్టతో దర్శనమిస్తున్న శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరుడు

అందుకే ఈ క్షేత్రానికి కుజ క్షేత్రంగా పేరొచ్చింది. దేశంలోని రెండు దేవాలయాల్లో (బిక్కవోలు, పళని) మాత్రమే కుమారసుబ్రహ్మణ్యస్వామిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సంతానం లేని తిమ్మగజపతి సంతానం కోసం సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించి సంతానం పొందారట. అందుకే షష్ఠి రోజున సంతానార్థు లైన స్త్రీలు ఆలయంలోని పుట్టపై నాగుల చీరను వుంచి దానిని ధరించి ఆలయం వెనుక శయనిస్తారు. తద్వారా సంతానప్రాప్తి కలుగు తుందని నమ్మకం.

ఇక్కడ స్వామి దక్షిణాభిముఖంగా వుండడం చేత ఆయనకు ఇష్టమైన మంగళవారం, శుద్ధ షష్ఠి, కృత్తికా నక్షత్రం రోజుల్లో ప్రత్యేక పూజలు, మిగిలిన రోజుల్లో సర్పానికి పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత. స్వామికి ఇష్టమైన పర్వదినాల్లో రాహు, కేతు, కుజ, సర్ప దోషాలకు ప్రత్యేక పూజలు చేయిస్తుంటారు.

బిక్కవోలు పేరు చెప్పగానే అందరికీ గుర్తుకొచ్చేది బాణసంచా. స్థానికంగా తయారీదారులైన గోలింగేశ్వర ఫైర్‌వర్క్స్, కనకదుర్గా హాస్సేనియా ఫైర్‌వర్క్స్ వారు తయారు చేసిన బాణసంచాను షష్ఠి రోజున రాత్రి పది గంటల నుంచి తెల్లవారేవరకు పోటీపడి కాలుస్తారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

వాసు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు



రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన షష్ఠి ఉత్సవాలకు బిక్కవోలుకు లక్ష మందికి పైగా భక్తులు వస్తారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్నానవాటికలు, బారి కేడ్లు, నాగుల చీరలు ధరించి శయనించే స్త్రీలకోసం ఆలయం వెనుక ప్రత్యేక ఏర్పాట్లు చేశాము. ఈ ఏడు ఉత్సవాల నిర్వహణకు రూ.80 లక్షలు వ్యయం చేస్తున్నాం. ఈ నెల 27 నుంచి ఆలయ ప్రాంగణంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశాము. డిసెంబరు 2న భారీ అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇక పిఠాపురం కేంద్రంగా..!

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యకలాపాలు ఇక్కడి నుంచేనా?
- ఇక్కడా జనసేన సెంట్రల్ ఆఫీసు
- పవన్ బస చేసేందుకు వీలుగా ఇల్లు
- మరో 2.63 ఎకరాలు కొనుగోలు
- ఇప్పటివరకూ కొన్నది 20.7 ఎకరాలు



పిఠాపురం పట్టణ శివారులో పవన్‌కల్యాణ్ తాజాగా కొన్న భూమి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఇక్కడ మరిన్ని భూములు కొనుగోలు చేస్తుండడం ఇందుకు బలం చేకూరుస్తోంది. జనసేన సెంట్రల్ ఆఫీసుతోపాటు పవన్ ఉండేందుకు ఇంటిని ఇక్కడ నిర్మించనున్నారు. కార్యకర్తలు ఉండేందుకు, సమావేశాల నిర్వహణకు, అతిథులు వస్తే ఉండేందుకు వీలుగా గెస్ట్‌హౌస్‌లు నిర్మించనున్నట్లు చెప్తున్నారు.

పిఠాపురం పట్టణ శివారులో ఇలింద్రాడ వద్ద గతంలోనే భూములు కొనుగోలుచేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తాజాగా మరిన్ని భూములు కొనుగోలు చేశారు. ఈ ప్రాంతంలో మరిన్ని పొలాలు కొనేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. కోస్తాంధ్ర పరిధిలో రాజకీయ కార్యకలాపాలన్నింటినీ ఇక్కడి నుంచే నిర్వహించేందుకు వీలుగా ఇక్కడ నిర్మాణాలు జరగనున్నాయి. పిఠాపురంలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హోదాలో తొలిసారి సొంత నియోజకవర్గానికి వచ్చిన ఆయన తాను ఇక పిఠాపురం నివాసినేనని, ఇక్కడ భూములు కొనుగోలుచేశానని ప్రకటించారు. ఇక్కడే ఇల్లు నిర్మించుకుంటానని తెలిపారు. పార్టీ కార్యాలయం నిర్మిస్తానని, కార్యకర్తలు ఉదయం నుంచి రాత్రి వరకూ ఉండేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తానని చెప్పుకొచ్చారు. ఇది జరిగి 16నెలలు గడిచాయి.

మంగళగిరితోపాటు ఇక్కడ

ప్రస్తుతం జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం మంగళగిరిలో ఉంది. దీని నిర్మాణ ప్రక్రియ దాదాపు పూర్తయింది. అదే తరహాలో పిఠాపురంలో కొన్న భూముల్లో సెంట్రల్ ఆఫీసు నిర్మాణం చేపట్టనున్నారు. పవన్ ఇక్కడి నుంచే కార్యకలాపాలు చేపట్టేందుకు, సమావేశాల నిర్వహణకు వీలుగా నిర్మాణంఉంటుందని అంటున్నారు. పవన్ నివాసంఉండేందుకు ఇల్లు నిర్మించనున్నారు.ఇక్కడే జనసైనికులు, వీరమహిళలు,నాయకులు ఉండేందుకు నిర్మాణాలు చేపట్టనున్నారు. పవన్ రాకపోకలు సాగించేందుకు వీలుగా హెలిప్యాడ్ నిర్మిస్తారు. అతిథులకు గెస్ట్‌హౌస్‌లు నిర్మించే అవకాశం ఉంది. ఇప్పటికే ఎమ్మెల్సీ హరిప్రసాద్ ఈ భూములను పరిశీలించి వెళ్లారు. త్వరలోనే నిర్మాణాల ప్లాన్ రూపొందించి పనులు ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అప్పటివరకు ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో..

పార్టీ కార్యాలయం, ఇల్లు నిర్మాణం పూర్తయ్యే వరకూ పవన్‌కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గానికి వచ్చిన సమయంలో ఆర్అండ్‌బీ అతిథి గృహంలో బసచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం గెస్ట్‌హౌస్‌ను ఆధునికీకరించే పనులు చురుగ్గా సాగుతున్నాయి. పవన్‌కోసం రెండు సూట్‌రూమ్‌లు సిద్ధం చేశారు. సమావేశాల నిర్వహణకు హాలు ఏర్పాటు చేశారు. ఇక నుంచి పిఠాపురం నియోజకవర్గంలో తరచూ పర్యటించేందుకు ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. మొత్తం మీద పవన్ కార్యకలాపాలకు పిఠాపురం కేంద్రం కానుంది.

ఎక్కడెక్కడ కొన్నారంటే..

పిఠాపురం పట్టణ శివారులో ఇల్లింద్రాడ జంక్షన్ దాటిన తర్వాత గొల్లప్రోలు టోల్‌గేట్‌కు వెళ్లే మార్గంలో తొలుత 3.52 ఎకరాలను కొనుగోలు చేశారు. తదనంతరం మరో విడతలో 14.63 ఎకరాలను కొన్నారు. కొద్దిరోజుల క్రితం జాతీయ రహదారిని చేర్చి ఉన్న 2.63 ఎకరాల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశారు. తాజా కొనుగోలుతో మొత్తం 20.78 ఎకరాలను కొనుగోలు చేసినట్లైంది. ఇవన్నీ ఇల్లింద్రాడ, భోగాపురం గ్రామాల పరిధిలోకి వస్తాయి. పిఠాపురం పట్టణానికి చేర్చి హైవే చెంతనే ఉండడంతో ఇక్కడ ఇల్లు, కార్యాలయాలు నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుందనే భావనలో డిప్యూటీ సీఎం పవన్ ఉన్నట్లు చెప్తున్నారు. ఇంకా మరిన్ని భూములు కొనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

హరోంహర.. శరవణభవ..

- అనపర్తిలో వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కావడి ఉత్సవం



సంతానం లేని మహిళలపైనుంచి దాటుతూ ఆశీర్వదిస్తున్న కావడి ధరించిన మాలధారులు

అనపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని వీర్రాజు మామిడివద్ద కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో షష్ఠి వేడుకల సందర్భంగా సోమవారం కావడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు.ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కావడి భుజాన ఎత్తుకుని ఉత్సవాన్ని ప్రారంభించారు. సంతానంలేని మహిళలు స్వామిని పూజించారు. అనంతరం కావడి ధరించిన మాలధారులు వారిపైనుంచి దాటుతూ వారికి సంతానప్రాప్తి కలగాలని దీవించారు. ఈ సందర్భంగా రథంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తూ 279మంది స్వామి మాలధారులు కావడి ధరించి నృత్యాలు చేస్తూ ఉత్సవం నిర్వహించారు. ఇది తమిళనాడులోని పళనిని మరిపించింది. కావడి ధరించిన భక్తులకు మహిళలు పూజలు చేశారు. కేరళ వాయిద్యాలు, కోలాట నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు వోగిరెడ్డి సత్తిరెడ్డి, మండ పోతారెడ్డి, మండ రామారెడ్డి, కర్రి సుధాకరరెడ్డి, తమలంపూడి వీర్రాఘవరెడ్డి,గంగిరెడ్డి,బూరయ్య పర్యవేక్షించారు.

8, 9 తేదీల్లో భారతీయ భాషలపై 'నన్నయ'లో జాతీయ వర్క్‌షాపు



జాతీయ కార్యశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు,నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో డిసెంబరు 8,9 తేదీల్లో 'భారతీయ భాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలం' అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యశాలకు ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరవుతారన్నారు. భారతీయ భాషా సమితి సీనియర్ నిపుణుడు ఆచార్య ఆర్ఎస్ సర్రాజు, అకడమిక్స్ కోఆర్డినేటర్ కె.గిరిధరరావు, తానా సాహితీ వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్‌తో పాటు తెలుగు, హిందీ, సంస్కృత భాషా ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. భారతీయభాషల్లో ఏకరూప శాస్త్రీయ సాంకేతిక పదజాలంపై మరింత అవగాహన పెంచుకునేందుకు నన్నయ అనుబంధ కళాశాలల తెలుగు, హిందీ, సంస్కృతం అధ్యాపకులను, పాఠ్యపుస్తకాలు రచించిన విద్యావేత్తలను, భాషాభిమానులను ఆహ్వానిస్తున్నామన్నారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ తలారి వాసు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాకినాడలో లక్కీ షాపింగ్ మాల్ 14వ షోరూమ్ ప్రారంభం



షాపింగ్‌మాల్‌లో కొత్తచీరతో సినీనటి ప్రియాంక మోహన్



వేదికపై హైపర్ ఆది సందడి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న నటి అనసూయ

కాకినాడ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మెయిన్‌రోడ్‌లో లక్కీషాపింగ్ మాల్ 14వషోరూమ్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సినీ హీరోయిన్, ఓజీ ఫేం ప్రియాంక మోహన్, ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్, హాస్యనటుడు హైపర్ ఆది విచ్చేసి సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పాల్గొన్నారు. షాపింగ్ మాల్ అధినేతలు రత్తయ్య, శ్రీనివాస్, స్వాములు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో ఫ్యామిలీ కలెక్షన్స్‌లో తిరుగులేని ఆదరణ పొందిన లక్కీ షాపింగ్ మాల్ కాకినాడలో 14వ షోరూమ్‌ను ప్రారంభించిందన్నారు. నమ్మకమైన నాణ్యత, అందుబాటు ధరలు, ట్రెండీ కలెక్షన్లు నిండిన లక్కీ షాపింగ్ మాల్‌లో బడ్జెట్ ధరల్లో వస్త్రాలను అందించనున్నామన్నారు. 30ఏళ్ల నమ్మకమైన వ్యాపార ప్రయాణంలో కొత్తమైలురాయిని చేరుకుందన్నారు. నాలుగు అంతస్తుల విశాల భవనంలో ముస్తాబైన ఈ కొత్త మాల్ కాకినాడ ఫ్యాషన్ లైఫ్ స్టైల్‌కు కొత్త నిర్వచనం ఇవ్వనుందన్నారు. ఎత్నిక్‌వేర్‌నుంచి ఆధునిక వెస్ట్రన్ స్టైల్స్ వరకు అందుబాటు ధరల్లో ఉంచామన్నారు. నాయకులు గ్రంధి బాబ్జీ, బచ్చు శేఖర్, సంగిశెట్టి అశోక్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన యువతీ, యువకులు, మహిళలు సినీ తారలతో సెల్ఫీలు దిగారు.



ముగిసిన జూడో పోటీలు

ఓవరాల్ చాంపియన్స్ కాకినాడ జట్టు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జూడో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో రెండు రోజులు జరిగిన జూడో సీనియర్స్ చాంపియన్‌షిప్ సోమవారం ముగిసింది. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కాకినాడ జిల్లా జట్టు కైవసం చేసుకుంది. రెండో స్థానంలో తూర్పు గోదావరి జట్టు, ఉమెన్ కేటగిరీలో రెండో స్థానంలో కాకినాడ జిల్లా జట్టు నిలిచాయి. విజేతలకు జూడో సంఘం రాష్ట్ర సీఈవో వెంకట్, కాకినాడ చైర్మన్ వెలగ వెంకటకృష్ణారావు, కాకినాడ జిల్లా కోశాధికారి రమణ, డీఎస్ఏ కోచ్ తేజ బహుమతులు అందజేశారు. వివిధ జిల్లాల కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లాల బాలుర ఖోఖో పోటీలు

- విజేతగా ప్రకాశం జిల్లా జట్టు
- ద్వితీయ, తృతీయస్థానాల్లో చిత్తూరు, విశాఖ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడాసమాఖ్యఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఈనెల 22నుంచి జరిగిన అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలుర ఖోఖో పోటీలు సోమవారం ముగిశాయి. ప్రకాశం జట్టు(ప్రథమ), చిత్తూరు జట్టు(ద్వితీయ), విశాఖ జట్టు(తృతీయ) స్థానాల్లో నిలిచాయి. ముగింపోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారుల నుంచి జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీఎస్డీవో సతీష్‌కుమార్, ఖోఖో సంఘ అధ్యక్షుడు పట్టాభి, మాచరరావు, సురేష్ రాజు, మాజీ కార్యదర్శి జార్జి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, కోచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర జట్టు: బి.తిరుమల, పి.నవీన్, పి.వెంకటేశ్వర్లు, జి.చంద్రు, వై.యశ్వంత్, సీహెచ్‌డీ ప్రసాద్, ఎంపీపీ రెడ్డి, హెచ్‌వీడీ హనుమంతు, ఐ.రోహిత్, ఆర్.బాలాజీ, ఎన్.లక్ష్మణ్, టీఎస్ సాయిమణికంఠ, స్టాండ్‌బైలుగా జి.లక్ష్మీప్రసాద్, ఎ.జయంత్, జె.ఇల్లప్ప, జీడీ భాస్కర్, డి.రాజు.



ప్రకాశం జిల్లా జట్టుకు కప్ అందజేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

సత్యదేవుడి కార్తీకమాస ఆదాయం రూ.21.75 కోట్లు



భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తగ్గిన వ్రతాల సంఖ్య

పెరిగిన ఆదాయం

వెల్లడించిన ఈవో సుబ్బారావు

అన్నవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి ఈ ఏడాది కార్తీకమాసంలో అన్ని విభాగాల ద్వారా రూ.21,75,95,167 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. సోమవారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటుచేసి వివరాలను వెల్లడించారు. సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసంలో విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను రెండోవిడత సోమవారం లెక్కించారు. రూ.1,77,73,072 నగదు, 43 గ్రాముల బంగారం, 978 గ్రాముల వెండి సమకూరాయి. అయితే వీటితో కలిపి కార్తీకమాసంలో మొత్తంగా రూ.21,75,95,167 ఆదాయం సమకూరిందని వెల్లడించారు. గతేడాది కార్తీక మాసంతో పోలిస్తే ఈ ఏడాది కార్తీకంలో వ్రతాల సంఖ్య 12,666 తగ్గగా అన్ని విభాగాల ఆదాయం నుంచి గతేడాది కంటే రూ.62,13,099 పెరిగిందన్నారు. వీటిలో ప్రధానంగా వ్రతం టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.7.81 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ. 4.57 కోట్లు, హుండీలలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.51 కోట్లు, సత్రంగదుల అద్దెల ద్వారా రూ.1.23 కోట్లు ఆదాయం లభించింది. మొత్తం 15 విభాగాల నుంచి ఈ ఆదాయం సమకూరింది. మిగిలిన విభాగాల ఆదాయాలను పరిశీలిస్తే కల్యాణమండపాల ద్వారా రూ.6.18 లక్షలు, స్వామివారి నిత్యకల్యాణాల నుంచి రూ.7.52 లక్షలు, ఆర్జితసేవల ద్వారా రూ. 9.63 లక్షలు, ఏసీ వ్రతాల నిర్వహణ ద్వారా రూ.61.56 లక్షలు, రవాణా విభాగం రూ. 38.39 లక్షలు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.89.60 లక్షలు సమకూరాయని వెల్లడించారు.

తుఫాను వల్ల తగ్గిన వ్రతాలు

వ్రతాలసంఖ్య తగ్గడానికి మొంథా తుఫాను కారణమన్నారు. ఈ ఏడాది కార్తీకంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా సిబ్బంది సమష్టిగా కష్టపడి పనిచేశారన్నారు. చైర్మన్ రోహిత్ నిరంతరం పర్యవేక్షణతో సత్ఫలితాలు సాధించామన్నారు. దేవదాయశాఖ ప్రత్యేక అధికారిగా రీజినల్ జాయింట్ కమిషనర్ వేండ్ర త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్లు రమేష్‌బాబు, సూర్యచక్రధరరావు, విశ్వనాధరాజును నియమించి వారి సలహాలు, సూచనలు పర్యవేక్షణలతో అంతా సవ్యంగా జరిగిందన్నారు. ఇదిలా ఉండగా గతేడాది కంటే కార్తీకమాసం ఆదాయం పెరగడానికి లీజుల నుంచి గతంలో రూ.1.09 కోట్లు వసూలుకాగా ఈ ఏడాది కార్తీకంలో రూ.2.27 కోట్లు వసూలు కావడం, గతేడాది ఆదాయంలో హుండీల కానుకలు 32 రోజులుకు చూపించగా ఈఏడాది కార్తీక ఆదాయంలో హుండీ ఆదాయం 49రోజుల ఆదాయం చూపడంతో ఆదాయం పెరిగినట్టు ఈవో వెల్లడించారు. కార్తీకంలో ఇంజనీరింగ్ సివిల్ పనులకు రూ. 81.88 లక్షలు, విద్యుత్ విభాగం నుంచి రూ.20లక్షలు వ్యయం చేశారన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బాబూరావు, పీఆర్వో అనకాపల్లి ప్రసాద్, ఏఈవోలు, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆదాయం రూ.70.11 లక్షలు

అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన శ్రీఅంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని కార్తీకమాసంలో లక్షలాది మంది భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అక్టోబరు 22 నుంచి నవంబరు 20 వరకు ప్రత్యేక దర్శనాలు, ప్రసాదాలు, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.37,99,038 ఆదాయం రాగా స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు ద్వారా రూ.32,12,352 ఆదాయం వచ్చింది. మొత్తంగా రూ.70,11,390 ఆదాయం వచ్చిందని ఏసీ ఎం కేటీఎస్వీ ప్రసాద్ తెలిపారు. నిత్యాన్నదానంలో 86వేల మంది భక్తులు నెల రోజుల పాటు స్వామివారి ప్రసాదం స్వీకరించారని తెలిపారు. స్వామివారి ఆలయానికి చేరుకునేందుకు ప్రధాన మార్గమైన చించినాడ బ్రిడ్జి మరమ్మతుల కారణంగా రాకపోకలు నిలుపుదల చేయడం, మొంథా తుఫాన్ కారనంగా గత సంవత్సరం కంటే ఈ ఏడాది ఆదాయం స్వల్పంగా తగ్గిందని ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



యాళ్ల నరసింహస్వామి

అమలాపురం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థి యాళ్ల నరసింహస్వామి స్వర్ణ పతకం సాధించాడు. డిసెంబరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్టు చీఫ్ కోచ్ పడాల అంజి తెలిపారు. స్వామిని స్కూలు ప్రిన్సిపాల్ నంద్యాల మనువిహార్ అభినందించారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి

గుండెపోటుతో చుండ్రు శ్రీవరప్రకాష్ కన్నుమూత

ఇంటికి తరలివచ్చిన నాయకులు, వ్యాపారవేత్తలు





ప్రకాష్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల, అమలాపురం ఎంపీ హరీష్

మండపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణానికి చెందిన టీడీపీ నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ (51) గుండెపోటుతో ఆదివారం రాత్రి అకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన సతీమణి గతంలో అనారోగ్యంతో మరణించగా, ఆయన మాతృమూర్తి అనంతలక్ష్మి(అమ్ములు) ఏడాది కిందట కన్నుమూశారు. ఆయన కుమారుడు కిరీటి యూఎస్‌లో చదువుతుండగా ఆయన కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. ప్రకాష్‌కు సేవాతత్పరుడిగా పట్టణంలో మంచిపేరు ఉంది. ఆదివారం రోజంతా పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన రాత్రి ఇంటికి చేరిన తర్వాత ఆరోగ్యం నలతగా అనిపించడంతో సమీపంలో ఆర్ఎంపీని పిలిపించుకున్నారు. తర్వాత మందులు వేసుకుని విశ్రాంతి తీసుకుంటుండగా ఒక్కసారి గుండెపోటుతోపాటు బీపీ అధికం కావడంతో ఆయనను ఇంటి వద్ద నుంచి హుటాహుటిన మండపేటలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆయన కన్నుమూశారని వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మరణ వార్త పట్టణమంతా వ్యాపించటంతో పార్టీ శ్రేణులు, హితులు కేపీ రోడ్డులో దాసిరెడ్డి వారి వీధిలో ఉన్న ఇంటికి చేరుకున్నారు. ఆయన పార్థివదేహాన్ని ఇంటి వద్ద ఉంచారు. ఆయన కుమారుడు అమెరికా నుంచి వచ్చిన తర్వాత మంగళవారం అంత్యక్రియలను నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

కాగా ప్రకాష్ మృతితో ఆయన కుటుంబంతో పాటు టీడీపీలో విషాదచాయలు అలుముకున్నాయి. మండపేట మున్సిపల్ చైర్మన్‌గా 2014-2019 మధ్య పనిచేసిన ప్రకాష్ పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు శానిటేషన్ విషయంలో పలు అవార్డులు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు అన్నివిధాలా పార్టీ వ్యవహారాల్లో వెన్నుదన్నుగా నిలిచేవారు. ప్రస్తుతం మండపేటలో టీడీపీ వ్యవహారాల ఇన్‌చార్జిగానూ ఉన్నారు.

తీరనిలోటు : మంత్రి సుభాష్

విద్యావంతుడు రాజకీయనేత్త, వ్యాపారవేత్త, సామాజిక సేవా తత్పరుడిగా చుండ్రు శ్రీవరప్రకాష్ అతిపిన్న వయస్సులోనే గుండెపోటుకు గురై మరణించడం బాధాకరమని, ఆయన మృతి పార్టీకి కుటుంబానికి తీరని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మండపేటలో ప్రకాష్ స్వగృహానికి మంత్రి చేరుకుని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ప్రకాష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అమలాపురం ఎంపీ జీవీ హరీష్‌మాధుర్, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మండపేటలో దుకాణాలు బంద్

చుండ్రు శ్రీవరప్రకాష్ ఆకస్మిక మరణంతో మండపేట పట్టణంలో చాంబర్ ఆఫ్ కామర్స్ పిలుపు మేరకు సోమవారం వ్యాపార సంస్థలు మూసివేశారు. అలాగే మంగళవారం పట్టణంలో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలను ప్రకాష్ మృతికి సంతాపంగా మూసివేస్తున్నామని ప్రైవేటు పాఠశాల యాజమాన్యల సంఘప్రతినిధులు సోమవారం ప్రకటించారు.

మోరిలో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

13 జిల్లాల నుంచి పాల్గొన్న 312 మంది విద్యార్థులు



ఫెన్సింగ్ పోటీలను తిలకిస్తున్న ఎమ్మెల్యే దేవ.. క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే దేవ, డీఈవో



అంతర్వేది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం మోరి గ్రామంలో జానసుబ్బమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ టోర్నమెంట్ (ఎస్‌జీఎఫ్ అండర్-17) పోటీలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి అతిథులు, విద్యార్థులు ఆహ్వానం పలికారు. జాతీయ జెండా వందనం అనంతరం జ్యోతిని వెలిగించి ఎమ్మెల్యే, డీఈవో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలు మోరి హైస్కూలులో జరగడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రభుత్వం క్రీడల్లో తగిన విధంగా ప్రోత్సహిస్తుందని, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి నెలకొల్పాలని డీఈవో సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 312 మంది విద్యార్థులు పాల్గొనేందుకు విచ్చేశారు. జిల్లాకు 12 మంది బాలలు, 12 మంది బాలికలు చొప్పున 24 మంది వ్యక్తిగతంగా గ్రూప్ పోటీల్లో పాల్గొన్నారు. ఫెన్సింగ్ క్రీడలో 3 విభాగాలైన పాయల్, షాబర్, ఈపీలలో విజేతలైన మొదటి నాలుగు స్థానాలు సాధించిన 24 మందిని ఎంపిక చేసి డిసెంబరు 28, 29, 30 తేదీల్లో మహారాష్ట్రలోని శివాజీ షంభాజీ నగర్‌లో జరిగే జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్టు క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ కడలి నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో క్రీడల ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్, మోరిహైస్కూలు హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, గుండుబోగుల పెద్దకాపు, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహలక్ష్మిప్రసాద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతోనే గర్భిణి మృతి

కారకులెవరనేది ప్రభుత్వానికి నివేదిస్తాం

జీజీహెచ్ ఘటనపై విచారణ చేపట్టిన డీఎంఈ రఘునందన్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎంఈ డాక్టర్ రఘునందన్

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఇటీవల 8వ నెల గర్భిణితో పాటు ఆమె కడుపులో బిడ్డ కూడా మృతిచెందడంపై రాష్ట్ర డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ సోమవారం విచారణ నిర్వహించారు. నిర్లక్ష్యం కారణంగానే గర్భిణి మృతిచెందిందని ప్రాథమికంగా నిర్ధారించామని, అయితే నిర్లక్ష్యానికి కారకులెవరనేది ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎంఈ పేర్కొన్నారు. ఈ విచారణ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు గైనకాలజీ సెమినార్ హాల్లో జరిగింది. డీఎంఈతో పాటు ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరీ, డీఎం హెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ హాజరయ్యారు. గైనిక్ విభాగంలోని యాంటీనేటల్, జీబీసీయూ వార్డుల్లోని వైద్యుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరిని విచారించారు. కొంతమంది నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. సేకరించిన నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని డీఎంఈ వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు ఆసుపత్రిలో పలు అంశాలపై విషయాలను డీఎంఈ దృష్టికి తీసుకెళ్లారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ వ్యవహార శైలిని తీవ్రంగా ఆక్షేపించారు. ఇటువంటి దారుణ పరిస్థితులు జీజీహెచ్‌లో తలెత్తుతున్నా నిమ్మకు నీరెత్తుతున్నట్లు వ్యవహరిస్తున్నారని తగిన పర్యవేక్షణ ఉండడం లేదని డీఎంఈకి ఫిర్యాదు చేశారు. విచారణ సమయంలో మృతురాలి మల్లేశ్వరీ కుటుంబీకులు ఆమె 5 ఏళ్ల కుమార్తెతో కలిసి గైనిక్ విభాగం బయట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న డీఎంఈ ఆందోళనకారులను విచారణ జరిగే ప్రాంతానికి పిలిపించారు. మృతురాలి సోదరి, వదిన నుంచి కూడా వివరణతో కూడిన స్టేట్‌మెంట్లను తీసుకున్నారు. విచారణలో గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్ ఉన్నారు.



ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు ప్రథమం



రగ్బీ పోటీల్లో మొదటిస్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు

పిఠాపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. కర్నూలులో ఈనెల 23, 24 తేదీల్లో స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 13 ఉమ్మడి జిల్లాలు నుంచి బాలికల జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు విశేష ప్రతిభ కనబరచి మొదటిస్థానం సాధించింది. జిల్లా బాలికల జట్టుకు కోచ్, మేనేజర్లుగా పీడీలు శేషకుమారి, కె.నాగలింగేశ్వరరావు వ్యవహరించినట్టు రగ్బీ ఉమ్మడి జిల్లా కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. విజేతగా నిలిచిన బాలికల జట్టు సభ్యులు, కోచ్ లక్ష్మణరావును ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్ 19 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వెంకటరెడ్డి, ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.దొరబాబు, చైర్మన్ వియ్యపు రామన్నరాజు అభినందించారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లకు ద్వితీయస్థానం

ఐ.పోలవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పులివెందులలో ఈనెల 22 నుంచి 24వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 సాఫ్ట్‌బాల్ బాలబాలికల పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఇరు జట్లు ద్వితీయస్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో జి.వేమవరం జడ్పీ హైస్కూల్ చెందిన ఆరుగురు బాలురు, ఏడుగురు బాలికలు జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించారు. బాలుర విభాగం నుంచి ఎం.బాబు, మద్దింశెట్టి బాల ఆదిత్య ఉత్తమ క్రీడాకారులుగా ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఎం.ఝాన్సీ బెస్ట్ క్యాచర్ అవార్డు అందుకుంది. విజేతలు, కోచింగ్ మేనేజర్ అడ్డగాళ్ళ నాగరాంప్రసాద్‌ను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పాఠశాల హెచ్ఎం వారణాసి సుబ్రహ్మలక్ష్మీదేవి, సర్పంచ్‌లు నల్లా సుదర్శన్‌రావు, లంకలపల్లి దుర్గాదేవీమునిరాజు తదితరులు అభినందించారు.



సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయం సాధించిన బాలురు, బాలికల జట్ల సభ్యులు



రైలు ఢీకొని వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

బిక్కవోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన బేరా సత్యనారాయణ (57) తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని తుమ్మలపల్లి రైల్వేగేటు సమీపంలో రైలు పట్టాలు దాటుతూ గూడ్సు రైలు ఢీకొని మృతి చెందాడు. సామర్లకోట రైల్వే ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ బిక్కవోలులో లింగాల చెరువు వద్ద పనిచేస్తుంటాడు. అతడికి పుట్టుకతోనే పోలియో వల్ల కాలు, చేయి పడిపోయాయి. ఉదయం రైల్వేగేటు వద్ద బహిర్భూమికని రైలు పట్టాలు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి విశాఖ వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో శరీరం రెండుగా విడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసామని ఎస్ఐ వివరించారు.

మండపేటలో గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మండపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కలువపువ్వు సెంటర్‌లో సోమవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడని పట్టణ పోలీసులు తెలిపారు. సెంటర్‌లో ఉన్న అమ్మవారి ఆలయం చెంతనే ఉన్న సిమెంట్ బల్ల వద్ద 70 ఏళ్ల వృద్ధుడు మరణించాడు. మృతదేహంపై నీలం రంగు లుంగీ, వంగపువ్వురంగు తెలుపు పచ్చగీతలు గల టీషర్ట్ ఉన్నాయి. వివరాలకు మండపేట సీఐ సురేష్‌ను 9440796591లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గొల్లప్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఆదివారం గొల్లప్రోలు బైపాస్ 216వ జాతీయ రహదారి కూడలి వద్ద ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పిఠాపురం మండలం నరసింగపురం గ్రామానికి చెందిన ఉండ్రు కృష్ణారావు అలియాస్ రాజు (40) అక్కడికక్కడే మరణించగా, పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఉంటున్న గంధం శ్రీను (40)కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనును తొలుత పిఠాపురం సీహెచ్‌సీకి అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్టు గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ వివరించారు.

ముగ్గురు మోటారుసైకిళ్ల దొంగల అరెస్ట్

ఆరు మోటారుసైకిళ్లు స్వాధీనం

నగరం ఎస్ఐ చైతన్యకుమార్ వెల్లడి

మామిడికుదురు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 6 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోడు గ్రామానికి చెందిన నాగళ్ల అరవింద్, మరో ఇద్దరు బాల నేరస్తులు రెండు మోటారు సైకిళ్లపై శివకోడు నుంచి కాకినాడ వైపు వెళ్తున్నారు. గెద్దాడ హైవేలో వాహనాలు తనిఖీ చేస్తున్న నగరం పోలీసులు ఆ ముగ్గురిపై అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ప్రశ్నించగా నగరం పోలీసుస్టేషన్‌లో నమోదైన 3 మోటారుసైకిళ్ళ, రాజోలు, మలికిపురం, పాలకొల్లు పోలీసుస్టేషన్లలో చోరీ అయిన మరో 3 వాహనాలు కలిపి 6 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టినట్టు ఎస్ఐ తెలిపారు. వారిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ భీమరాజు, ఎస్ఐ చైతన్యకుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కొత్తపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెనికి చెందిన గొలకోటి ఆదిలక్ష్మి(110) సోమవారం ఇంటి వద్ద వయోభారంతో మృతిచెందింది. ఆమెకు ఐదుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు, 20 మంది మనవలు, 20 మంది మునిమనవలు, నలుగురు అనుమనవలు ఉన్నట్టు కుటుంబసభ్యులు చెప్పారు.

తుమ్మలపల్లిలో పేలిన రిఫ్రిజిరేటర్

రూ.5లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన రిఫ్రిజిరేటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ బొమ్మి

అల్లవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం తుమ్మలపల్లిలో ఆదివారం రాత్రి కాట్రు రామకృష్ణ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రిఫ్రిజిరేటర్ పేలిపోయింది. ఇల్లు కూడా పాక్షికంగా ధ్వంసమైంది. ఏసీ, మోటారుసైకిల్, మంచాలు, వంట సామగ్రి కాలిపోయి రూ.5లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాద స్థలిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, అమలాపురం అసెంబ్లీ వైసీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, ఎంపీపీ యిళ్ల శేషారావు, కొనుకు బాపూజీ, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, కె.శాంతికిరణ్, పులుసుగంటి గంగాధర్ పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:244601

స్థలం అమ్మబడును

రాజమండ్రి, లాలాచెరువు హౌసింగ్ బోర్డ్‌లో Hig 83, South Facing 321 గం॥ స్థలంలో 740 SFT ఇల్లు (East Facing) తో సహా అమ్మబడును ఆసక్తి కలవారు సంప్రదించగలరు. 970146 2900

AJD:

CHANGE OF NAME

★ I, Buthala Kartheek S/o Buthala Apparao R/o 7-15-28, Dargapeta, Peddapuram, East Godavari -533437, Peddapuram changed my name to Buthala Karthik. Hence, I can be called as Buthala Karthik, S/o Buthala Apparao. AJH-3469

4 Lines CLASSIFIED Rs.230/- Only

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువు

» సోమవారం అర్జీలు నిల్

» స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్‌కు వెళ్తున్న అర్జీదారులు

గోకవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దారు కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరువైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఒక అర్జీ కూడా అధికారులకు అందలేదు.కొద్దికాలంగా ఈ కార్యక్రమానికి అంతంత మాత్రంగానే ప్రజల నుంచి వినతులు అందుతున్నాయి.స్థానికంగా ఉన్న అధికారులకు తమ సమస్యలను వివరిస్తున్నా పరిష్కారం కాకపోవండంతో జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో జరిగే పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు చేసేందుకు స్థానిక ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.గతంలో గోకవరం మండలంలో చోటు చేసుకున్న భూ సమస్యలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు తదితర సమస్యలపై స్థానిక అధికారులకు ఫిర్యాదులు అందినా వాటిలో ఒకటో వంతు కూడా పరిష్కరించిన దాఖలాలు లేవని అర్జీదారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. కావున గోకవరంలో జరిగే పీజీఆర్ఎస్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయుడు: నల్లమిల్లి



అనపర్తిలో ఏకాత్మత ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రతను, సమైకృతను కాపాడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పటేల్ 150వ జయంతోత్సవాల్లో భాగంగా సోమవారం అనపర్తిలో మేరా భారత్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ వద్ద నిర్వహించిన ఏకాత్మత ర్యాలీని ఆయన ప్రారంభించి దేవీ చౌక్ వరకు పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత ప్రభుత్వం సమైక్యవాదం, సంఘీభావం తెలియజేయడమే లక్ష్యంగా ఏకాత్మక ర్యాలీలు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచంలోనే నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిన భారత్‌పై కొందరు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలంటే మనమంతా సమైక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, నాయకులు రావాడ నాగు, జుత్తుక కృష్ణ, గంగాధర చౌదరి, ఎన్ఆర్‌కే ప్రసాదరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుషుల్లో మానసిక ఒత్తిడితో ఇబ్బందులు


సదస్సుకు విచ్చేసిన డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడితో పురుషులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు.రాజమండ్రిలోని డాక్టర్ సాంబశివారెడ్డి హాస్పిటల్‌లో సోమవారం మానసిక ఒత్తిడిలో మగవారు అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆమె మాట్లాడుతూ సమాజంలో మగవారు ఏడవకూడదు, బలహీనంగా కనిపించకూడదనే నిబంధనలున్నాయని, భర్తగా,తండ్రిగా, బాధ్యతలు వహించే వ్యక్తిగా సమాజం పెట్టే అంక్షలు,ఒక పురుషుడిని మానసికంగా ఎంతగా అలసటకు గురిచేస్తాయో వివరించారు.శారీరక ఆరోగ్యంలాగే మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని తెలిపారు.ఇలాంటి సమస్యలేవైనా ఉంటే 9390 044031 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. తణుకు సైకాలజిస్టు పి.రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఆలుమగలకు దాంపత్య దూరం కనిపించని మానసిక ఒత్తిడిని పెంచుతుందన్నారు. వారి మధ్య ఉన్న అనుబంధం పురుషులకు మానసిక స్థిరత్వమిచ్చే ముఖ్య ఆధారమన్నారు.సదస్సులో వైద్యులు, యువత పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు పీజీఆర్ఎస్‌లో వినతి

దివాన్‌చెరువు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలోని ఎస్సీ, బీసీ శ్మశాన వాటికకు విద్యుత్ స్తంభాలు వేయించి విద్యుత్ దీపాల వెలుగులు అందించాలని కొత్తతుంగపాడుకు చెందిన నూకపెయ్యి చిన్న జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వినతిపత్రం అందజేశామన్నారు. శ్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తోందని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సంపూర్ణ వందేమాతరం గీతం ఆలాపన


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సీతంపేట గ్రంథాలయంలో సోమవారం సంపూర్ణ వందేమాతరం గీతం ఆలాపన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కళారత్న పీవీఎస్ కృష్ణారావు మాట్లాడుతూ వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలైన సందర్భంగా ప్రధాని పిలుపు మేరకు ఊరూవాడా వందేమాతరం గీతాలాపన సంబరాలు జరుగుతున్నాయన్నారు. డాక్టర్ తిలక్ మాట్లాడుతూ వందేమాతరం ఒక సమైక్య నినాదమని, స్వాతంత్ర సమర శంఖారావమని, ప్రతీ విద్యార్థి, ప్రతీ పౌరుడు విధిగా సంపూర్ణగీతం నేర్చుకోవాలన్నారు. సంపూర్ణ వందేమాతరం గీతాన్ని అలపించిన ప్రగతి హైస్కూల్ విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

జీజీయూలో ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవం

రాజానగరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించారు. చైతన్యరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఎన్‌సీసీ ద్వారా సమయపాలన, క్రమశిక్షణతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. దేశసేవ కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని, యువత పునరంకితం భావంతో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రొవైస్ చాన్సలర్ కేవీబీ రాజు, మోహన రాజు, పి.కృష్ణంరాజు, కేఆర్ వర్మ,ఎన్ వీవీఎస్ఎన్ మూర్తి, పీజీ రామానుజం పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే దంపతుల ఘన స్వాగతం


పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కోరుకొండ, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): గోపాలపురం నియోజకవర్గం పర్యటన నిమిత్తం సోమవారం మధురపూడి విమానాశ్రాయానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్‌కు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వెంకటలక్ష్మి దంపతులు ఘన స్వాగతం పలికారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, ఇతర టీడీపీ నాయకులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

చెకుముకి జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దివాన్‌చెరువు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చెకుముకి జిల్లాస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాత తుంగపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీఆర్ కమల్‌దాస్ సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు కె.శ్రావణి, జి.షణ్ముఖప్రియ, ఎస్.ఎస్తేరు రాణి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి కన్సొలేషన్ బహుమతులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు బందిలి శ్రీను, ఎండీఎస్ఎన్ రెడ్డి, వి.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

కోరుకొండ షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు


విద్యుత్ దీప కాంతుల్లో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయం

కోరుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 26 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు 71 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం పక్కనే రూ.2 కోట్లతో నూతన ఆలయాన్నిస్థానిక ప్రభుత్వ హైస్కూల్ నుంచి ఆర్టీసీ బస్‌స్టేషన్ వరకు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. సోమవారం రాత్రి స్వామివారి గుడి పాట నిర్వహించారు. అలాగే స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు మాటూరి చంద్రశేఖర్, లక్ష్మి తులసి దంపతులు 600 గ్రాముల వెండి నాగాభారణాన్ని సమర్పించారు.

నూతన విత్తన రకాలను

వినియోగించాలి

» ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు నరసింహారావు, శ్రీనివాసు

» పలుచోట్ల రైతన్నా మీ కోసం

దివాన్‌చెరువు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన కొత్త వరి, మొక్కజొన్న, మినుము, పెసర, నువ్వుల విత్తన రకాలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు, ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాసు రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని శ్రీకృష్ణపట్నం, నరేంద్రపురం గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుని నాణ్యమైన, అధిక దిగుబడులు పొందాలన్నారు. యాంత్రీకరణలో భాగంగా డ్రోనులను ఉపయోగించుకోవాలని సూచించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు సమగ్ర పోషక యాజమాన్యం పాటించాలన్నారు. వచ్చే దాళ్వాకు అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. డీఆర్‌సీ ఏడీఏ జయరామలక్ష్మి నేల పరీక్ష ఆధారిత పోషక యాజమాన్యం పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రా మంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యం వల్ల కలిగే ఆరోగ్య, ఆర్థిక లాభాలను వివరించారు. డిమాండ్ ఆధారిత పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని, ఇందులో భాగంగా చిరుధాన్యాల పంటల వైపు మొగ్గుచూపాలన్నా రు. డ్రోన్లు, యాంత్రీకరణ, భూసార పరీక్షలు వంటి సాంకేతికతను వినియోగించుకోవడం ద్వా రా పంట నాణ్యత పెరిగి అధిక లాభాలు ఆర్జిం చవచ్చునని సూచించారు. రైతులకు అన్నదాన సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం, పంట నష్ట పరిహారం, సబ్సిడీపై ఎరువుల మందులు అంది స్తున్నామన్నారు.వ్యవసాయరంగాన్ని అన్ని విధా ల అభివృద్ధి చేసి రైతును రాజును చేయడానికే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తేతలి సుమ, సర్పంచ్ కొవ్వూరి సీతారత్నం, కర్రి సత్యగౌరి, రావాడ నా గు, దుర్గారెడ్డి, పడాల వెంకట్రామారెడ్డి, ఇందల వీరబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో నిర్వహించిన కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ అడపా భరత్ విచ్చేసి మాట్లాడారు. కొత్త ఆలోచనలను అందిపుచ్చుకుంటూ వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చి లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ అడపా వెంకట్రావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ పిర్ల వెంకటేశ్వరరావు, నాయకులు కటారి అంజనికుమార్, మోగంటి ప్రసాద్, నడిమింటి వెంకటరమణ, ఆదిరెడ్డి శ్రీను తదితరులు గ్రామంలోని ప్రతీ రైతు ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

అనపర్తి: మండలంలోని దుప్పలపూడిలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి వ్యవసాయ శాఖాధికారులతో కలిసి పాల్గొన్నారు. ముందుగా రైతుల కోసం రూపొందించిన పంచసూత్రాలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి కూటమి అధికారంలోకి వచ్చాక చేకూర్చిన మేలును వివరించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ సిరసపల్లి లక్ష్మి, గంగిరెడ్డి, ఎస్‌వీ, కుత్సం కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణపట్నంలో రైతన్నా మీకోసం కరపత్రం ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు


కామరాజుపేట కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ భరత్

స్త్రీశక్తి అమలులో ఇబ్బందులను పరిష్కరించాలి

ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ రావు


డిపో వద్ద యునైటెడ్ వర్కర్స్ యూనియన్ గేట్ మీటింగ్ నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం స్త్రీ శక్తి అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎస్‌పీ రావు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రాజమహేంద్రవరం డిపో వద్ద జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం అమలు చేయడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని, ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తక్షణమే బస్సుల సంఖ్యను పెంచి, చెక్కింగ్ విధానం మార్చి జాప్యాన్ని నివారించాలన్నారు. విధుల్లో ఉన్న సిబ్బందిపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు పెట్టి శిక్షించాలని, దాడికి గురైన సిబ్బంది తిరిగి విధుల్లో చేరే వరకూ ఆన్‌డ్యూటీగా పరిగణించాలని కోరారు. యూనియన్ డిపో కార్యదర్శి బీఆర్‌కే కుమారి మాట్లాడుతూ అన్ని బస్సులకు హైడ్రాలిక్ డోర్లు ఏర్పాటు చేసి మహిళా ప్రయాణికులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలని, డోర్లు లేని బస్సుల్లో జరిగిన ప్రమాదాలకు సిబ్బందిని బాధ్యులను చేయడం సరికాదని అన్నారు. అలాగే, పురుషులు, మహిళలకు టిక్కెట్లు ఇచ్చే విధానం తీసివేసి డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే టిక్కెట్లు జారీ చేసేలా నిబంధన మార్చాలని ఆమె డిమాండ్ చేశారు. అలాగే యూనియన్ అధ్యక్షుడు ఏఎస్ నారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.

బాలుడికి పాము కాటు

గోకవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఓ బాలుడు పాము కాటుకు గురయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం..మండలంలోని కృష్ణునిపాలెం గ్రామానికి చెందిన కోటిరెడ్డి సాత్విక్ అనే ఐదేళ్ల బాలుడు సోమవారం ఉదయం స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చాడు. ఈ క్రమంలో అక్కడ ఆడుకుంటుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే నిర్వాహకులు, గుర్తించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడు ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పోలీసులతో తమ్ముళ్ల వాగ్వాదం

కోరుకొండ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికేందుకు వచ్చిన టీడీపీ సీనియర్ నాయకులు తనకాల నాగేశ్వరరావు గంగిశెట్టి చంటిబాబు, కంటే నాగకేశవరావును విమానాశ్రయం లోపలికి పోలీసులు అనుమతించకపోవడంతో కొందరు కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో విమానాశ్రయం వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మింగి లక్ష్మినారాయణ, దాడి శ్రీను, రాజేష్‌ల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పోలీసులు ఇరువర్గాలను శాంత పరిచి కొందరిని అను మ తించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష


కలెక్టరేట్ వద్ద దీక్ష చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్. వెంకటేష్ మాట్లాడుతూ 2023లో సమగ్ర శిక్ష ఉద్యోగులు పెద్దఎత్తున సమ్మె చేయగా అప్పటి ప్రభుత్వం చర్చలకు పిలిచి ఉద్యోగుల డిమాండ్ల విషయమై కమిటీ వేసి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, అనంతరం సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఎన్‌డీఏ పార్టీ అధికారంలో వస్తే ఆ హామీలన్నీ నెరవేరుస్తామని హామీ ఇచ్చిందని, కాని ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. జేఏసీ అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఉపాధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గౌరవ అధ్యక్షుడు వంశీ కృష్ణరాజు మాట్లాడుతూ రిటైర్మెంట్ వయసు పెంచాలని కోరారు. పీటీఏ కార్యదర్శి మిరపరాజు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పీటీఐలు, సీఆర్ఎంటీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, అకౌంటెంట్‌లు, మెసెంజ్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు తదితర విభాగాల వారు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్ విద్యార్థుల సంక్షేమం, భద్రత పట్టదా ?

రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు

పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు


పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న రాజు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు ఎస్సీ హాస్టల్స్ విద్యార్థుల సంక్షేమం, భద్రత గాలికొదిలేశారని, దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి విద్యార్థుల బాగోగులు పట్టించుకోవాలని రిపబ్లికన్ పార్టీ (బొజ్జా తారకం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా వెంకటరత్న రాజు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఎస్సీ హాస్టల్స్‌లో సమస్యలపై కలెక్టర్ కీర్తి చేకూరికి వినతిపత్రం అందజేశారు. రాజమహేంద్రవరంలోని నెంబర్-1 కాలేజీ బాలుర హాస్టల్‌లో లేడీ వార్డెన్ హాస్టల్ విద్యార్థులకు భోజనం సక్రమంగా పెట్టకుండా అమానుషంగా వ్యవహరిస్తున్నారని, అన్నం పెట్టమన్నందుకు పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పడంతో ఆందోళనకు గురైన విద్యార్థులు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారని తెలిపారు. అయినా నేటికీ లేడీ వార్డెన్‌పైనా, ఇతర బాధ్యులపైనా చర్యలు లేవని, విచారణ ఏమైందో కూడా తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది కొరత ఉన్నారంటూ డీఎస్‌డబ్ల్యువో, మరికొందరు అసలు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, కానీ హాస్టల్లో పనిచేయాల్సిన వంట కుక్ జిల్లా ఆఫీస్‌లో ఎందుకు పనిచేస్తున్నారో తేల్చాలని కోరారు. జిల్లా అధికారులే ఇలా వ్యవహరిస్తుంటే ఇక ఎస్సీల సంక్షేమం కాగితాలకే పరిమితమా అనే ఆందోళన కలుగుతోదన్నారు. కలెక్టర్ తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకుని ఎస్సీ హాస్టల్స్ విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

రాజానగరం వెలుగు ఏపీఎం, సీసీ వేధిస్తున్నారు!

» విమోచన కల్పించండి » కలెక్టర్‌కు కొండగుంటూరు సంఘం వినతి

దివాన్‌చెరువు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండల వెలుగు ఏపీఎం గుమ్మడి సునీత, సీసీ తొంటా లక్ష్మి వేధింపుల నుంచి తమకు విమోచన కల్పించాలని కొండగుంటూరు గ్రామ సంఘం నుంచి పి.దుర్గాదేవి జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు. స్థానిక విలేకరులకు వినతిపత్రం నకలును అందజేశారు. తమ గ్రామ సంఘం వీవోఏ దాట్ల లలితకు మూడు నెలల గౌరవ వేతనం మంజూరు చేయాలని అందులో విజ్ఞప్తి చేశారు. గతంలో తాము వెలుగు ఏపీఎం సునీత, సీసీ లక్ష్మిలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదులు చేశామని, కానీ ఇంతవరకూ కనీస చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వీవోఏకు మూడు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకుండా రుణాల విషయమై ఆమె సంతకాలు చెల్లవంటూ అనధికారికంగా ఏపీఎం, సీసీలు బ్యాంక్ అధికారులుకు మౌఖిక ఆదేశాలు జారీచేసి స్వయం పరపతి కలిగిన గ్రామ సంఘాలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలపై చొరవ చూపి తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తిని ఆంధ్రజ్యోతి ఫోన్‌లో సంప్రదించగా ఈ విషయమై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందిందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రైతు సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే గోరంట్ల


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజవేలులో నిర్వహించిన సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. వ్యవసాయ సంక్షోభాలకు శాశ్వత పరిష్కారం చూపిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి ప్రభుత్వం నూతన విధానాలతో ముందుకు వెళుతుందన్నారు. అనంతరం రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, వల్లూరి చెంచు రాజు, నిమ్మలపూడి రామకష్ణ, గాలి వెంకటేశ్వరరావు, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా ఆదేశించారు.సోమవారం ఆర్ఎంసీలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. మొత్తం 27 అర్జీలు వచ్చాయి. వాటిని పరిశీలించిన కమిషనర్ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు.

పుష్కరాల అంచనాలు పూర్తి చేయండి

రానున్న గోదావరి పుష్కరాలను సమర్థవంతంగా నిర్వహించడానికి శాఖల వారీగా నిర్దిష్టమైన అంచనాలు రూపొందించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు.ఈ మేరకు అన్నిశాఖల అధికారులతో ముందస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్, ఘాట్లు, రహదారుల విస్తరణ, పార్కింగ్, ట్రాఫిక్, నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేసుకునే క్రమంలో గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు.సమావేశంలో ఏసీ పీవీ రామలింగేశ్వర్, ఏఎస్పీ మురళీకృష్ణ,కొవ్వూరు కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు,ఎండోమెంట్ ఆఫీసర్ ఈవీ సుబ్బారావు,ఎస్ఈ తిలక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. DISTRICT AND SESSION COURT, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
OS. No. 242 OF 2025

Between:
Sri. Upendrarao Muralidhar and others ...Plaintiffs
AND
1. The M.R.O/Tahsildar, Malkajgiri Mandal, Medchal Malkajgiri District, Telangana-500015
2. The M.R.O/Tahsildar, Rajahmundry Urban Mandal, East Godavari District, Andhra Pradesh- 533101.
3. All Concerned ...Defendants

To,
All Concerned,
Please take notice that the above name, Plaintiffs had filed the above suit for declaration of Legal Heirs of Late Varada Rao Upendra Rao. Therefore, all, Concerned/Defendant No. 3 are here by informed that the above suit is coming up for appearance/objections if any to be filed in the above suit. If any person/persons having any right /claim or interest what so ever they may do so by appearing either in person or through an advocate on 27-12-2025 at 10.30am before the above, mentioned court failing which the matter will be decided as per law.

SCHEDULE OF THE PROPERTY
All that of the building (with Old Door No.18/278 & New Door No.7-30-7) and now present Door No. 35-10-1 admeasuring 158.40 square yards or 132.42 square meters situated at Rajahmundry Basthi, East Godavari District, Rajahmundry Taluka and Sub Registrar now called as Danyam Pakalu, Revenue Ward No. 19, Rajamahendravaram, Andhra Pradesh and bounded by:
NORTH : Wall of this shareholder too some extent and wall of Prabhod to some extent 38 Ft. 10 And 12 Meters SOUTH : Training College galley 30 Ft. 9.31 Meters. EAST : G. Netravatamma share joint gulley 45 Ft. 14 Mtrs. WEST : B-Mark share wall, B &C marked shareholders shown in Plan joint place staircase 36 Ft. 11 Meters

Sd/- RAMBABU PAPISETTI
ANNAPURNA PAPISETTI
D.SHIVA KUMAR GOUD
ADVOCATES
ARTHA ASSOCIATES
Plot No. 105, Pent House, Saipuri Colony, 6th Avenue Road, Fourth cross Road, Sainikpuri Post, Secunderabad, Telangana State - 500094, Mobile No. 9989199965

In the court of the Hon'ble Special Court for Trial and Disposal of Commercial Disputes at Vijayawada.
I.A. 107/2023 in C.O.S. 11/2020

Between: M/s. Unibait Feeds Pvt.Ltd. Rep. by its Authorized Person, Gudivada - Petitioner
and
D.M.R. Aqua Feeds and Needs, Rep. by its Managing Partner, Mudunuri Srilakshmi - Respondants and 4 others

1st Respondant : D.M.R. Aqua Feeds and Needs, A. Regd. Partner Ship Firm rep. by its Managing Partner, Mudunuri Srilakshmi, W/o. Late Satyanarayana Raju, D.No.7-141, Youth Club road, Chinaamiram, Bhimavaram Rural Mandal, West Godavari District-534204.
2nd Respondant : Dandu Piramula Saikrishna Raju, S/o. Mohana Murali Krishnam Raju, working partner of D.M.R. Aqua Feeds and Needs, R/o. Manikodu Hamlet of Chataparru Gram Panchyat, Eluru Mandal, West Godavari Dist-534004.
3rd Respondant : Chekuri Ramanjaneya Raju, S/o. Maridi Raju, working Partner of D.M.R. Aqua Feeds and Needs, R/o. D.No. 1-8, Magam Inavalli Mandal, East Godavari District-533577.
4th Respondant : Dandu Mohana Murali Krishnam Raju, S/o. Satyanarayana Raju, R/o. Mandikodu Hamlet of Chataparru Gram Panchayat, Eluru Mandal, West Godavari-534004.
5th Respondant : Smt. Dandu Geeta, W/o. Mohana Murali Krishnamraju, R/o. Mondikodu, Hamlet Chataparru Gram Panchayat, Eluru Mandal, West Godavari District-534 004.

పై నెంబరు Petition ను Petitioner U/or-34 R-5(3) and U/Sec 151 of C.P.C ప్రకారము Final Decree Pass చేయమని కోరుచూ దాఖలు చేయగా, అందుపై Petition లో Respondants 1 to 5 లకు Notice ల నిమిత్తము శ్రీ కోర్టువారు ది. 08-12-2025నకు వాయిదాగా వేసి ఉన్నారు. కావున ఆ రోజు ఉ॥గం॥ 10.30 ని॥లకు Respondants 1 to 5 లు స్వయంగా కానీ, అడ్వకేట్ గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి Order ప్రకారము //

ఇట్లు
కె.వి.ఆర్.కె. రెడ్డి
పిటీషనర్ తరపు అడ్వకేట్, గుడివాడ

వాయిదా : 08-12-2025



ప్రభుత్వ ఆసుపత్రి, కళాశాల ఏర్పాటు చేయాలి
● పవన్‌కల్యాణ్‌కు చీపురుగూడెం గ్రామస్తుల వినతి
8



కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 166 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 166 అర్జీలు వచ్చాయి. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు రెవెన్యూ విభాగానికి సంబంధించి 79 అర్జీలు, పంచాయితీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధికి 29, మున్సిపల్ శాఖకు 10, హోంశాఖకు 9, వ్యవసాయశాఖకు 7, పాఠశాల విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, ఆరోగ్యశాఖ, విద్యుత్‌శాఖ, పౌరసరఫరాల శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పరిశ్రమల శాఖలకు 32 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు బదలాయించారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కి 36 ఫిర్యాదులు

రాజమహేంద్రవరం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 36 అర్జీలను అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. వారి సమక్షంలోనే ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా తగిన ఆదేశాలు జారీ చేశారు. చట్టపరిధిలో వెంటనే ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు.



'దారి'కి తెస్తున్నారు!

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా మారిన రహదారులకు మంచిరోజులు వస్తున్నాయి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో రహదారుల దారుణ దుస్థితిపై వచ్చిన కథనాల నేపథ్యంలో డిసెంబరు నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆర్అండ్‌బీ అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వచ్చే నెలలోగా మొత్తం రూ.110కోట్లకుపైగా నిధులు వెచ్చించి రహదారులను దారికి తేవడానికి సిద్ధమయ్యారు. తాజాగా ఉమ్మడి జిల్లాకు రూ.49.50 కోట్లు మంజూరవగా, వీటితో పలు కీలక రహదారులను రిపేర్లు చేయడానికి నిర్ణయించారు. త్వరలో వీటికి టెండర్లు పూర్తిచేసి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేయబోతున్నారు.

- ఉమ్మడి జిల్లాలో రహదారులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు
- నరకప్రాయంగా మారిన రోడ్ల రిపేర్లకు రూ.49.50 కోట్లు మంజూరు
- కాకినాడ జిల్లాలో 7 రోడ్లకు 16.21కోట్లు, కోనసీమలో రూ.30 కోట్లు
- రాజమహేంద్రవరంలో కేశవరం -బొమ్మూరు రోడ్డుకు రూ.2.78 కోట్లు
- వీటికి టెండర్లు పూర్తయ్యాక మరో రూ.60 కోట్లతో మిగిలినవీ దారికి..
- 'ఆంధ్రజ్యోతి' కథనాల నేపథ్యంలో రోడ్ల మరమ్మతులకు సీఎం ఆదేశం

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో రహదారులు గోతులమయంగా మారాయి. అడుగుతీసి అడుగు వేయాలంటేనే నరకప్రాయంగా మారాయి. ఏటా వర్షాలు, వరదలతో పట్టణాల నుంచి గ్రామాల వరకు రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. అయితే వీటికి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సి ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం అయిదేళ్లపాటు వీటిని పూర్తిగా గాలికి వదిలేసింది. జనం గోతుల రహదారుల్లో ప్రయాణించి మృత్యువాత పడడం, తరచు గాయాలపాలవుతున్నా వైసీపీ ప్రభుత్వం ఏనాడూ కనీసం పట్టించుకోలేదు. ఆ తర్వాత గడచిన ఏడాదిన్నరలో కోనసీమలో భారీ వర్షాలు, మూడుసార్లు గోదావరి వరద, తుఫాన్లతో రోడ్లన్నీ మరింత దారుణంగా మారాయి. అటు తూర్పుగోదావరి జిల్లాలో భారీవర్షాలు, తుఫాన్ల ప్రభావంతో వందల కిలోమీటర్ల మేర రోడ్లు రూపురేఖలు కోల్పోయాయి. అలాగే కాకినాడ జిల్లాలోను భారీవర్షాలు, తుఫాన్లు, ఏలేరు వరదతో రోడ్లన్నీ వందల కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. అయితే వీటిని చాలావరకు ప్రభుత్వం మరమ్మతులు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది జనవరిలో సంక్రాంతి నాటికి రహదారుల కింద యుద్ధప్రాతిపదికన గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిన రోడ్లన్నింటినీ మరమ్మతులు చేసింది. ఒక్క కాకినాడ జిల్లాలో 119 రహదారులను రూ.31.76 కోట్లు వెచ్చించి గుంతలు పూడ్చింది. అలాగే కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో రూ.62కోట్లతో రిపేర్లు చేసింది. అయితే ఇవి చేయగా ఇంకా వందల కిలోమీటర్ల కొద్దీ రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు. పైగా ఈలోపు ఈ ఏడాదిలో కురిసిన వర్షాలు, తుఫాన్ల ముప్పుతో ఆ రోడ్లు మరింత దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కాకినాడ-సామర్లకోట రహదారిని రూ.1.50 కోట్లతోను, కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును రూ.80 లక్షలతోను, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లోను అనేక రహదారులను మరమ్మతులు చేయగా, మళ్లీ దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో అధ్వాన దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ఇటీవల కథనాలు ప్రచురించింది. అటు రాష్ట్రవ్యాప్తంగాను అన్ని జిల్లాల్లో రోడ్ల దుస్థితిపై వెలువడిన కథనాలపై సీఎం చంద్రబాబు స్పందించారు. తక్షణం అన్నింటికి మరమ్మతు చేయాలని, డిసెంబరుకి ఎక్కడా రోడ్లపై గుంతలు కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వచ్చేనెల మొదట్లో రూ.49.50 కోట్లతో పలు రహదారుల మరమ్మతుకు ఆర్అండ్‌బీ సన్నద్ధమైంది.

ఆ జిల్లాలో రూ.30 కోట్లతో...

కోనసీమ జిల్లాలో ఇప్పటికే ఈ ఏడాది జనవరినాటికి పాట్ ఫ్రీ హోల్ కింద రూ.45 కోట్ల వరకు వెచ్చించి ప్రభుత్వం రహదారులను మరమ్మతు చేసింది. మిగిలిన రహదారులపైనా దృష్టిసారించింది. తాజాగా రూ.30 కోట్లతో 12 కీలక రహదారులను అద్దంలా మార్చబోతోంది. ముఖ్యంగా ముమ్మిడివరం-ముక్తేశ్వరం రహదారి మరమ్మతులకు రూ.1.67కోట్లు కేటాయించింది. ముమ్మిడివరం- కాట్రేనికోన ఐనాపురం రోడ్డుకు రూ.2.92కోట్లు, రాజవరం- పొదలాడ రూ.3.11కోట్లు, ఉప్పలగుప్తం మండలంలో సిరిపల్లి-మునిపల్లి రహదారి మరమ్మతుకు రూ.2.28 కోట్లు, ఐ.పోలవరంలో మురమళ్ల-ఎదుర్లంక రోడ్డుకి రూ.40.22 లక్షలు, ముమ్మిడివరం-ముక్తేశ్వరం రూ.1.67 కోట్లు, కాకినాడ జిల్లాలో సర్పవరం జంక్షన్ నుంచి లైట్‌హౌస్ పేట రోడ్డుకు రూ.1.97కోట్లు, తుని ఎర్రకోనేరు నుంచి వేమవరం రోడ్డుకు రూ.3.01కోట్లు, కత్తిపూడి పామర్రు రోడ్డు గొల్లప్రోలు పరిధిలో రూ.3.16 కోట్లు, తుని కత్తిపూడి రోడ్డు రూ.2.54కోట్లు, గండేపల్లి మండలం తాళ్లూరు-ఎల్లమిల్లి రూ.1.59 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గం పరిధిలో నరసాపురపుపేట-కాట్రావులపల్లి రహదారికి రూ.1.60 కోట్లు, కాజులూరు మండలం శలపాక-కాజులూరు రహదారి మరమ్మతుకు రూ.2.34 కోట్లు వెరసి కాకినాడ జిల్లాలో మొత్తం రూ.16.21 కోట్లు మరమ్మతులకు నిధులు విడుదల చేసింది. అలాగే రాజమహేంద్రవరంలో కేశవరం వయా బొమ్మూరు రోడ్డు మరమ్మతుకు రూ.2.78 కోట్లు కేటాయించింది. వీటన్నింటికి ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలవగా, వచ్చే నెల మొదటి వారంలో పనులు ప్రారంభించి రహదారులను తీర్చిదిద్దడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. అలాగే ఇవి పూర్తయ్యేలోగా మరో రూ.60 కోట్లతో ఉమ్మడి జిల్లాలో తుఫాన్లు, వరదలు, భారీవర్షాలకు దెబ్బతిన్న మిగిలిన రహదారులను కూడా మరమ్మతు చేయనున్నారు. వీటిలో ఒక్క కాకినాడ జిల్లాలోనే మొంథా తుఫానుకు దెబ్బతిన్న రహదారులకు రూ.30 కోట్లకుపైగా నష్టం వాటిల్లగా వాటికి రిపేర్లు చేయనున్నారు. అలాగే ఇటీవల వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న కాకినాడ-సామర్లకోట రోడ్డుని ప్రభుత్వం రూ.2.50కోట్లతోను, కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డును అరకోటికిపైగా వెచ్చించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది.



కలెక్టరేట్‌లో సమీక్ష చేస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్. పక్కన మంత్రి దుర్గేష్, కలెక్టర్ కీర్తి చేకూరి

24 గంటల్లోపే ధాన్యం సొమ్ము చెల్లింపులు జరగాలి

- వాతావరణ మార్పుల నేపథ్యంలో 27 నాటికి అదనపు వాహనాలు సిద్ధం చేయాలి
- ధాన్యం సేకరణపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష

రాజమహేంద్రవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి సంభవించే వాతావరణ మార్పుల నేపథ్యంలో అదనపు వాహనాలు సిద్ధంచేయాలని, రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై.మేఘ స్వరూప్‌తో కలసి స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం సాయంకాలం ఖరీఫ్ ధాన్యం సేకరణ, పౌరసరఫరాల శాఖ పనితీరు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలలోపే సొమ్ము రైతు ఖాతాల్లో జమ కావాలన్నారు. ఎక్కడైనా ఆలస్యమైతే అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. జిల్లాలో 2,237 రవాణా వాహనాలు సిద్ధంగా ఉన్నాయని, రాబోయే మూడు రోజుల్లో వాతావరణ మార్పుల వచ్చే అవకాశం ఉన్నందున రవాణా, కొలతలు, నిల్వల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో జిల్లాలో 94.79శాతం పూర్తి చేసి ముందజలో ఉన్నారని, మిగిలిన కార్డులు కూడా మన మిత్ర యాప్ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 6.54 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచిందని, గత ఏడాదికంటే రెండున్నర రెట్లు ఎక్కువ సన్నద్ధం చేసినట్టు ఆయన చెప్పారు. రైతుల పంట రోడ్ల మీద ఎక్కడా నిల్వ ఉంచకుండా అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. రైతుల్లో అభద్రతాభావం లేకుండా చూడాలని, కొంతమంది దళారులు వాతావరణ మార్పులను సాకుగా చూపి తక్కువ ధరకే కొనుగోలు చేయాలని చూస్తున్నారన్నారు. రూ.400 వరకూ తక్కువకు కొనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలిసిందని, ఎవరూ అలా చేయవద్దని ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటికే 1.35 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, 24 నుంచి 48 గంటలలోపు రూ.240 కోట్లు జమచేసినట్టు చెప్పారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ వ్యవసాయాధారిత జిల్లాగా ఉన్న తూర్పుగోదావరిలో గతేడాది 2.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే, ఈసారి 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్టు చెప్పారు. రైతులకు అందించే టార్పాన్లు, గోనె సంచులు నాణ్యతపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ శాఖల మధ్య సమన్వయంతో ధాన్యం సేకరణ విజయవంతంగా సాగుతోందన్నారు. వర్ష సూచనల నేపథ్యంలో రవాణా, నిల్వ, గోనె సంచులు పంపిణీ, మిల్లర్ల సన్నద్ధతపై ప్రత్యేక మానిటరింగ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో టి.సీతారామమూర్తి, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ బి.గణేష్, డీఎస్వో వి.పార్వతి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, మార్కెటింగ్ అధికారి ఎం.సునీల్‌వినయ్ పాల్గొన్నారు. కాగా కొవ్వూరులోని దొమ్మేరు, చాగల్లులో కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మంత్రి మనోహర్ మరో మంత్రి దుర్గేష్‌తో కలిసి పరిశీలించారు.



కొవ్వూరు మండలం దొమ్మేరు లేఅవుట్‌లో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు



గాయత్రీ ఇసుక ర్యాంపులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

హైకోర్టుకు నివేదిక ఇస్తామని వెల్లడి

రాజమహేంద్రవరం, నవంబరు24(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం సమీపాన గోదావరిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న గాయత్రీ ర్యాంపును కలెక్టర్ కీర్తి చేకూరి సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైన్స్ ఏడీ డి.ఫణీంద్రరెడ్డి, ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులతో కలసి ఆమె ఈ తనిఖీ నిర్వహించారు. గాయత్రీ 1, 3 ర్యాంపుల నిర్వహణ జరుగుతున్న స్థలం ఫారెస్ట్‌కు చెందినదని ఫారెస్ట్ అధికారులు, తమకే చెందినదని బొమ్మ ఆనందకుమార్ అనే వ్యక్తి మధ్య వివాదం నడుస్తోంది. అయినా అక్కడ ఇసుక లోడింగ్ ఆగకపోవడంతో ఆదివారం జేసీ అక్కడకు వెళ్లి ఇసుక లోడింగ్ ఆపేశారు. ఈ వివాదంలో హైకోర్టు ఆదేశాల మేరకు కలెక్టర్ ర్యాంపును పరిశీలించారు. అక్కడ ప్రస్తుతం ఇసుక లోడింగ్ ఎవరు చేస్తున్నారని ఆరా తీశారు. నీళ్లు నమిలిన అధికార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ కీర్తి అక్కడ సేకరించిన వివరాలు, ప్రస్తుత పరిస్థితిపై హైకోర్టుకు నివేదించనున్నట్టు సమాచారం.



విమానాశ్రయం వద్ద డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి దుర్గేష్, అధికారులు

డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం

కోరుకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు మంత్రి కందుల దుర్గేష్, పోలీసు అధికారులు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్‌లో ఘనస్వాగతం పలికారు. నిడదవోలు మున్సిపాలిటీ ఏర్పడి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న డైమండ్ జూబ్లీ ఉత్సవాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మంత్రి దుర్గేష్ ప్రస్తావించారు. డిప్యూటీ సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఎస్పీ నరసింహకిషోర్, నిడదవోలు మున్సిపాలిటీ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్‌చైర్మన్ షేక్ వజీరుద్దీన్ ఉన్నారు.

074 అనే కోడ్‌తో కూడిన బ్యాచ్ మందులు ఇక్కడ లేనేలేవు

డీపీఎంవో డాక్టర్ శ్రీవల్లి



యూపీహెచ్‌సీలో మందులు తనిఖీ చేస్తున్న డాక్టర్ శ్రీవల్లి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం నారాయణపురం యూపీహెచ్‌సీలో కాలంచెల్లిన మందులు రోగికి ఇచ్చారని సోషల్‌మీడియాలో పోస్టుకు సంబంధించి అసలిక్కడ 074 అనే కోడ్‌తో కూడిన బ్యాచ్ నెంబరు మందులు లేనేలేవని డీపీఎంవో డాక్టర్ శ్రీవల్లి తెలిపారు. సోమవారం ఉదయం ఈ యూపీహెచ్‌సీలో రికార్డులను, మందులను ఆమె తనిఖీ చేశారు. ట్విట్టర్‌లో పోస్టుచేసిన పేషెంట్ నూర్జాన్ అనే మహిళ అని గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీవల్లీ మాట్లాడుతూ సెప్టెంబరు 6న నూర్జాన్ పీహెచ్‌సీకి వచ్చి చికిత్స చేయించుకుందని తెలిపారు. ఈ మహిళకు బీపీకి సంబంధించి మందులు నెలరోజులు ఇవ్వడం జరిగిందన్నారు. ఒకవేళ ఏ కారణం చేతనైనా మీరు ట్యాబ్‌లెట్లు వేసుకోకపోతే నెలదాటాక వాటిని వినియోగించవద్దని చెప్పడం కూడా జరిగిందన్నారు. ఆ మందులు వినియోగించుకోకుండా రెండు నెలల తర్వాత సోషల్ మీడియాలో కాలంచెల్లిన మందులు పీహెచ్‌సీలో ఇచ్చారని పెట్టారని శ్రీవల్లి తెలిపారు. నూర్జాన్ మరొక మందు కూడా కాలం చెల్లిందని పెట్టిన 074 అనే కోడ్‌తో కూడిన బ్యాచ్ నెంబరు మందులు అస్సలు మనకు సరఫరా లేదన్నారు. విచారణ జరుగుతోందని, త్వరలో నిజానిజాలు తెలుస్తాయన్నారు. పీహెచ్‌సీల్లో నెలనెలా మందుల తనిఖీలు జరుగుతున్నాయని చెప్పారు.

ఈఎస్ఐ ఆస్పత్రిలో మందుల్లేవ్

- కాలదోషానికి దగ్గరైనవే పంపిణీ
- బయట కొనుక్కోలేక రోగుల తిప్పలు
- ఆరు నెలల నుంచీ ఇదే పరిస్థితి
- భవనం కొత్తది.. సదుపాయాలు పాతవే
- 3 ఫ్లోర్లలో ఒకటే వాడకం.. 2 ఖాళీ
- నిర్వహణ బాగోకపోతే రూ.56 కోట్లు వృథా
- గాడిలో పెట్టే కృషి చేయని ప్రజాప్రతినిధులు





(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా రాజమహేంద్రవరంలో కార్మిక ప్రభుత్వ బీమా వైద్యశాల (ఈఎస్ఐ ఆస్పత్రి) నూతన భవనం అందుబాటులోకి వచ్చిందని ఆ భవనాన్ని చూసి సంబరపడడం తప్ప ఆస్పత్రికి పట్టిన రుగ్మతలకు చికిత్స జరగడం లేదు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ మురళీ మోహన్ చొరవతో పునాది రాయి పడింది. తర్వాత వైసీపీ ప్రభుత్వంలో పనులు నత్తనడకన సాగాయి. మూడేళ్ల ఆపసోపాల తర్వాత ఈ జూలైలో గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభమైనా పూర్తిస్థాయిలో వైద్య సదుపాయాలు అందుబాటులోకి రాలేదు. ఈఎస్ఐ ఆస్పత్రికి రోజూ 120 వరకూ ఓపీ ఉంటుంది. ఈఎస్ఐలో కార్మికులు, వారి కుటుంబాలకు వైద్యం అందించాల్సి ఉంటుంది. ఈ కార్మికులు అందరూ రూ.20వేలలోపు వేతనం కలిగిన వాళ్లే ఉంటారు. దీంతో మందులు లేకపోవడంతో బయట కొనుక్కోవాల్సి వస్తోంది. డాక్టర్లు రాసిన మందుల్లో చాలా మటుకు అందుబాటులో ఉండకపోవడం వారికి తలపోటుగా మారింది. మందులు దాదాపుగా నిండుకొని ఆరు నెలలవుతోంది. ఇప్పుడు రూ.4కోట్ల విలువైన 200పైగా మందుల జాబితాతో ఇండెంట్ రెడీ చేశారు. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత వస్తే అదృష్టమనే చెప్పాలి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు ఫార్మసీలో ఉన్న కొద్దిపాటి మందులనే పంపిణీ చేస్తున్నారు. వాటిలో చాలా వరకూ ఒకటి, రెండు నెలల్లో కాలదోషం పట్టేవే ఉంటున్నాయి. కనీసం కాల్షియం బిళ్లలు కూడా లేవంటే దుస్థితిని అర్థం చేసుకోవచ్చు.

● రూ.56 కోట్లు వృథానా..

ఆస్పత్రి నిర్మాణానికి రూ.97.98 కోట్లను 2020 ఆగస్టు 19న కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే 5.83 ఎకరాల విస్తీర్ణంలో రూ.56కోట్ల వ్యయంతో ఈ ఆస్పత్రిని నిర్మించారు. ఆస్పత్రి జీ+2 ఫ్లోర్లతో 13376 చదరపు మీటర్లలో ఉండగా, మార్చురీ భవనం 77.40 చదరపు మీటర్లలో నిర్మించారు. వాస్తవానికి 2022 జూలై 10కి నిర్మాణం పూర్తి కావాల్సి ఉన్నా 2024 డిసెంబరు 30కి పూర్తయింది. ఆరు నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఈఎస్ఐ కార్పొరేషన్ బదిలీ చేసింది. క్యాజువాలిటీ ఆపరేషన్ థియేటర్, అగ్నిమాపక తలుపులు, ఐసీయూలు, యోగా గదితోసహా అన్ని గదులనూ ఔరా అనిపించే విధంగా నిర్మించారు. మహిళా శిశు వైద్య విభాగానికి ఏకంగా ఒక ఫ్లోర్‌నే కేటాయించారు. అన్ని రకాల వైద్య సదుపాయాలకు ఏర్పాట్లు కల్పించారు. సెకండరీ కేర్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనిక్, ఆర్థో, ట్రామా కేర్‌తోసహా 26 రకాల వైద్య సేవలను అందించే విధంగా నిర్మాణాలు ఉన్నాయి. సెంట్రల్ ఏసీ సదుపాయంతోపాటు భద్రతకు 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులోని ప్రతి మంచం వద్ద ఆక్సిజన్, వెంటిలేటర్ సౌకర్యం ఉంది. కాకపోతే మంచాలే ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. ఆపరేషన్ థియేటర్లు అత్యంత విశాలంగా ఉండి యంత్రాల కోసం ఎదురు చూస్తున్నాయి. ఈ ఆస్పత్రి పరిధిలో రాజమండ్రి, సీతంపేట, లాలాచెరువు, ఇన్నీసుపేట, కడియం, ధవళేశ్వరం, కొవ్వూరు, నిడదవోలు, తాడేపల్లిగూడెం,తణుకు, భీమవరం, వేంద్ర డిస్పెన్సరీలు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోరులో 32 గదుల్లో ఓపీ, వ్యాధి నిర్ధారణ, ఈసీజీ, ఎక్స్‌రే, క్యాజువాలిటీ, క్యాజువాలిటీ ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, క్యాంటీన్, లాండ్రి, ఆయుర్వేద, హోమియో, ఎమర్జెన్సీ వార్డు, ఫిజియోథెరపీ తదితర సేవలు ఉంటాయి. రెండో ఫ్లోరును పూర్తిగా మాతా శిశువుల కోసం కేటాయించారు. వారికి సంబంధించిన అన్ని వైద్య సదుపాయాలనూ ఏర్పాటు చేస్తున్నారు. ఐసీయూ, పీఐసీయూ, హెచ్‌డీయూ, ఎన్ఐసీయూ, ఎస్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు, ప్రొసీజర్ రూమ్స్, లాకర్లు ఇలా 26 రూములు నిర్మించారు. మూడో ఫ్లోరులో 12 పడకల చొప్పున 6 వార్డులుండగా.. పురుషులకు, మహిళలకు విడివిడిగా విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. వార్డుల్లో సైతం ఆక్సిజన్, వెంటిలేటర్, వంటి సదుపాయాన్ని కల్పించారు. ఇదే ఫ్లోరులో లైబ్రరీ, బ్లడ్ స్టోరేజీ, ఎంఆర్‌డీ, పరిపాలన గదులు ఉన్నాయి. ఆస్పత్రి భవనంలో ప్రస్తుతం ఒక్క ఫ్లోరు మాత్రమే వినియోగంలోకి వచ్చింది. రెండో ఫ్లోరులో సూపరింటెండెంట్ గదిని మాత్రమే వాడుతుండగా మిగతా ఫ్లోర్లు, గదులు.. రోగులు, సిబ్బంది, వైద్య పరికరాల కోసం ఎదురు చూస్తున్నాయి. వైద్యులు, సిబ్బందికి నివాసాలను కూడా ఆస్పత్రి ప్రాంగణంలోనే నిర్మించారు. నిర్వహణ గాడిలో పడకపోతే కోట్లు వృథా అయినట్టేనని భావించాల్సి వస్తుంది.

● స్టాఫ్‌ని నియమిస్తేనే..

ఈ ఆస్పత్రిలో డాక్టర్లు, నర్సింగ్, పరిపాలన కలిపి 30 మంది ఉన్నారు. కానీ 100 మందికిపైగా ఉండాలి. స్వచ్ఛ భారత్‌ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుండగా.. ఈ ఆస్పత్రిని హౌస్ కీపింగ్ స్టాఫ్ సరిపడా లేకుండానే పరిశుభ్రతను నెట్టు కొస్తున్నారు. కొత్త భవనంలోకి ఆస్పత్రి కార్యకలాపాలు మారిన తర్వాత 12 మంది పారిశుధ్య సిబ్బందిని, ఆరుగురు సెక్యూరిటీని మాత్రమే ఇచ్చారు. మూడుకుపైగా ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, అత్యవసర వైద్య విభాగాలు ఉండడంతో షిఫ్టుల వారీగా పనిచేయాల్సి వస్తుంది. అందువల్ల 100 మంది వరకూ డాక్టర్లు ఉండాలి. హౌస్ కీపింగ్ సిబ్బంది 200 మంది వరకూ అవసరం అవుతుంది. కానీ సూపర్ స్పెషాలిటీ సేవలు లేకపోవడంపై విస్మయం వ్యక్తమవుతోంది.



చాగల్లులో ధాన్యం నమూనాలను పరిశీలిస్తున్న మంత్రులు నాదెండ్ల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి

రైతుల సంక్షేమానికి పెద్ద పీట

- రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

చాగల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పెద్దపేట వేస్తుందని, వారి అభివృద్ధికోసం అనేక సంస్కరణలు తీసుకొస్తున్నామని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన చాగల్లులోని ధాన్యం కొనుగోలు కేంద్రంను మంత్రి కుందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావులు కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతంను, గోనె సంచులు అందుబాటు సిబ్బంది పనితీరు పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు ఇబ్బంది కలుగకూడదని ఈపర్యటన చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 51లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం నిర్ణయంతో రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. వాతావరణం అనుకూలించక కొంత అభద్రతా భావంలో ఉన్నారని వారికి ధైర్యం కల్పించే విధంగా ప్రభుత్వ యంత్రాంగం, మిల్లర్లు సహకరించాలని ఆయన కోరారు. కొవ్వూరు నియోజకవర్గంలో 80శాతం వరకు ధాన్యం కొనుగోలు లక్ష్యం పూర్తయ్యిందని సంతోషం వ్యక్తం చేశారు. ధాన్యం సేకరణ జరిగిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం, కౌలు రైతు సంఘం వారి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్‌వో పార్వతి, డీఎంబీ గణేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, కూటమి నాయకులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, ఆళ్ళ హరిబాబు, కేతా సాహెబ్, పిక్కి నాగేంద్ర, తాళ్ళూరి వరప్రసాద్, కొప్పాక విజయకుమార్, ఉప్పులూరి చిరంజీవి, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, అబ్బూరి సీతారాముడు, చిటికెన పెంటారావు, బొడ్డు కేశవకుమార్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు
- దూబచర్లలో ఇంటింటికీ రైతన్నా- మీకోసం

నల్లజర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రసాయ ఎరువులు పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. సోమవారం దూబచర్లలో రైతన్నా-మీకోసం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ఇంటింటికీ వెళ్లి రైతుల యోగక్షేమాలు, పంట గిట్టుబాటు ధరలు, కూరగాయలు, వాణిజ్య పంటలు, పొగాకు, మొక్కజొన్న, వరి, మామిడి రైతులను ఆయన పలకరించారు. ప్రస్తుత మార్కెట్‌లో సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెడు తున్నట్లు పేర్కొన్నారు. సేంద్రియ పద్ధతులద్వారా భూసారం పెరుగుతుందని, భావితరాలకు మంచి భూమిని అందించినట్లు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సూచించినట్లు పంచా సుత్రాలను రైతులు పాటిం చి ఆధునాత పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయాలన్నారు .నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సోమశేఖర్, వ్యవసాయ అనుభంధఅధికారులు పాల్గొన్నారు.



దూబచర్లలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మద్దిపాటి, ఏఎంసీ చైర్మన్ బ్రహ్మారాజు

రైతుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి: తహసీల్దార్

ఉండ్రాజవరం(ఆంధ్రజ్యోతి): రైతులందరి వివరాలు యాప్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ వీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రైతుల వివరాలు యాప్‌లో నమోదుచేసే కార్యాక్రమాన్ని, రైతులకు ఇచ్చే కరపత్రాలను తహసీల్దార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లకు ప్రభుత్వం చేసే సంక్షేమ, అభి వృద్ధి కార్యక్రమాలు వివరించాలని చెప్పారు. ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.శ్రీనివాస్, వ్యవసాయాధికారి బి.రాజారావు, వ్యవసాయ, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.




ఉండ్రాజవరంలో, దేవరపల్లి మండలం రామన్నపాలెంలో రైతన్నా మీకోసం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, రైతులు,

రైతన్న మీకోసం ప్రభుత్వం కృషి: ఎంపీడీవో

దేవరపల్లి(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్‌లో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా మొదటి, రెండవ విడతగా రూ.14వేలు ప్రతీ రైతుకుటుంబానికి భరోసా కల్పించామని మండల ఎంపీడీవో నాగార్జునరావు అన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా సోమవారం రామన్నపాలెం, దేవరపల్లిలో రైతులను కలిసి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, అధికారులు వివరించారు. ఈ సందర్భంగ ఎంపీడీవో నాగార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు రామారావులు మాట్లాడుతూ రైతులకు వ్యవసాయశాఖ, ఉద్యానవనశాఖ ద్వారా సంక్షేమ పథకాలు అమలుచేస్తామన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలు, చిరుధాన్యాలు పండించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల కోసం అన్నిరకాలపై సబ్సిడీ అందజేస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు అనిత, లక్ష్మీ, వెటర్నరీ అసిస్టెంట్ రాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమారి, రైతులు కాట్రగడ్డ రామ్మోహన్, పిన్నమని ఉదయభాస్కర్, పరిమి వీర్రాజు, అన్నం రెడ్డి బాలసుబ్రహ్మణ్యం, పిన్నమని రామకృష్ణ పాల్గొన్నారు.

రైతుకు ఏ చిన్న నష్టం జరిగినా స్పందిస్తాం

- దొమ్మేరు ఆర్‌ఎస్‌కె సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్

కొవ్వూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతుకు ఏ చిన్న నష్టం జరిగిన ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరులో ఈజీకే రోడ్డుపై జగనన్నకాలనీవద్ద ప్రైవేటు లేఅవుట్‌లో ధాన్యం ఆరబెట్టుకున్న రైతులను రాష్ట్ర ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేశారు. ధాన్యం ఆరబోసిన కల్లాల వద్దకు వెళ్లి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంట దిగుబడి, గోనె సంచుల నాణ్యత, గిట్టుబాటు ధరలపై ఆరా తీశారు. దొమ్మేరు ఆర్‌ఎస్‌కె సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌ఎస్‌కెల సిబ్బందికి మూడు నెలలుగా శిక్షణ ఇచ్చి ఎందుకు అని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ఎక్కడో పొరపాటు జరుగుతుందన్నారు. ఆర్‌ఎస్‌కె సిబ్బంది రైతుకు ధైర్యం చెప్పాలని, తమ గ్రామంలోని ప్రతీ రైతు పేరు తెలిసి ఉండాలికదా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ రాబోయో రోజులలో అందరూ సేంద్రియ ఉత్పత్తులవైపు చూస్తున్నారని రైతులు ఆ దిశగా సాగు పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలన్నారు. అందరూ ఒకటే రకం సాగుచేయకుండా వ్యవసాయశాఖ సూచించిన రకాలను పండించాలన్నారు. రైతులు పండించిన ధాన్యం 75 కేజీల బస్తాకు రూ.1792లు అందజేస్తున్నామన్నారు. రైతుకు అందుబాటులో ఉండే విధంగా రైతు సహాయక కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. రైతులు పండించిన నాణ్యమైన బియ్యం ప్రభుత్వం పాఠశాలల్లో మన బిడ్డలకు మధ్యాహ్న భోజన పథకంలో వినియోగిస్తుందన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఇచ్చిన టార్గెట్‌లో 80 శాతం పూర్తి చేశామన్నారు. ఎక్కడా రైతులను ఇబ్బంది పెట్టకుండా క్షేత్రస్థాయిలో గౌరవించాలని మిల్లర్లను కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింటు కలెక్టర్ ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు బేతిన నారాయణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, కలగర సుబ్బారావు, గారపాటి రామకృష్ణ, చావా శ్రీనివాసరావు, గొరిజాల సురేష్, కేవీకే రంగారావు, నాయుడు వీర్రాజు, సాయి, కంటిపూడి శ్రీనివాసరావు, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, గారపాటి శ్రీదేవి, మేణ్ణి పార్థు, జనసేన నాయకులు సుంకర సత్తిబాబు, అచ్యుతరాయుడు, ఉప్పులూరి చిరంజీవి, గంగుమళ్ళ స్వామి, కొప్పాక విజయ్‌కుమార్, ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాదవరావు, ఏడి సిహెచ్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఎ.గంగధర్, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొవ్వూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు గోనెమడతల వారి వీధికి చెందిన యాదం అప్పలసూరి (55) ఆర్‌అండ్‌బీ కార్యాలయంవద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో చాపలు తయారుచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. గత కొంతకాలంగా మధుమేహం, పక్షవాతం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. ఈనెల 23వ తేదీ రాత్రి 9 గంటలకు ఇంటివద్ద దుకాణానికి వెళుతున్నానని బయటకు వచ్చాడు. సోమవారం ఉదయం భార్య షాపు వద్దకు వచ్చి చూసేసరికి గెడంచికి తాడుతో ఉరి వేసుకుని మృతిచెంది కనిపించాడు. ఆరోగ్య సమస్యల కారణంగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుని కుమారుడు యాదం వీర నాగార్జున ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి, కళాశాల ఏర్పాటు చేయాలి

- కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గ ప్రజల కష్టాలు తొలగించాలి
- పవన్ కళ్యాణ్‌కు చీపురుగూడెం గ్రామస్థుల వినతి



చీపురుగూడెంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వినతి పత్రం అందిస్తున్న జనసేన నాయకులు

నల్లజర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకు ఆపద వచ్చిన మంచి ఆసుపత్రి లేదు, విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ కళాశాలలేదని ప్రభుత్వం స్పందించి రెండు నియోజకవర్గాలకు సంబంధించి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ కళాశాల ఏర్పాటుచేయాలని చీపురుగూడెం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు చెల్లు శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో జనసేన నాయకులు, గ్రామస్థులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఐయస్ జగన్నాధపురం నుంచి వచ్చే సమయంలో చీపురు గూడెంలో ఆయన కాన్వాయ్‌ను ఆపి పవన్‌కు వినతిపత్రం అందించి తమ సమస్యలను తెలియ జేశారు. దీనిపై పవన్ సానుకూలంగా స్పందించారు.

28, 29 తేదీలలో జిల్లా వాలీబాల్ బాలబాలికల ఎంపిక పోటీలు

కొవ్వూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా వాలీబాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 28వ తేదీన దేవరపల్లి మండలం దుద్దుకూరులో నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి గారపాటి రాఘవేంద్రరావు తెలిపారు. బాలుర జట్లకు 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి కొవ్వూరు ఎన్టీఆర్ స్టేడియంలోని అల్లూరి వెంకటేశ్వరరావు వాలీబాల్ గ్రౌండ్‌లో జరుగుతాయన్నారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, యూత్, సీనియర్స్ విభాగాలలో జిల్లా జట్లు ఎంపిక జరుగుతుందన్నారు. సబ్ జూనియర్స్ జనవరి 1వ తేదీ 2010, జూనియర్స్ జనవరి 1వ తేదీ 2008, యూత్ జనవరి 1వ తేదీ 2005 తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. సీనియర్స్‌కు వయో పరిమితి లేదన్నారు. ఎంపికైన జూనియర్ జట్లు డిసెంబర్ 5,6,7 తేదీలలో విశాఖజిల్లా యలమంచిలిలో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. ఎంపిక పోటీలలో శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాద్, జిల్లా సహాయ కార్యదర్శి జి.పవన్‌ల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. క్రీడాకారులు కె.రామ్‌కుమార్- 6303578996, జె.సురేష్-8297972333, జి.రాఘవేంద్రరావు- 7893383748లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జి.సత్యవర్మ, గౌతమీ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్, కార్యదర్శి సూరపనేని చిన్ని పాల్గొన్నారు.

నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా



నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

నిడదవోలు, నవంబరు 24(ఆంధ్ర జ్యోతి):నిడదవోలు మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికుల సంఖ్యపెంచి విధి నిర్వహణలో ఉన్న పారిశుధ్య కార్మికుల పని భారం తగ్గించాలని నిడదవోలు పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జువ్వల రాంబాబు అన్నారు. సోమవారం నిడదవోలు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జువ్వల రాంబాబు మాట్లాడుతూ పట్టణంలో 24వార్డులు ఉన్న కాలంలోనే 200మంది కార్మికులు పారిశుధ్యం, ఇంజనీరింగ్ పనులు నిర్వహించేవారన్నారు. ఇప్పుడు పట్టణంలో 28వార్డులుగా విస్తరించినా 110మంది పారిశుధ్య కార్మికులు ఉండగా అందులో 20మందిని ఆఫీసు డిప్యూటేషన్‌పై ఆఫీసులో పని చేయించుకొంటున్నారని అన్నారు. ఓసీ, బీసీలు పారిశుధ్య పనులు ఇష్టంలేక ఆఫీసులో చేసుకుంటున్నారని ఎస్సీ, రెల్లి కులస్తులు మాత్రమే పారిశుధ్య పనులుచేస్తూ వివ క్షతకు గురవుతున్నారని ఆరోపించారు. 200 మంది కార్మికులు ఉంటేనే పట్టణం పరిశుభ్రతకు నిలయంగా నిలుస్తుందన్నారు. దయామణి, రాజేశ్వరరావు, కె.జార్జ్, సారధి, పి.చిరంజీవి, బి.సాయిరమణ పాల్గొన్నారు.



డివిజనల్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణీ సుస్మిత

పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదుల స్వీకరణ

కొవ్వూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో స్వీకరించిన అర్జీలకు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిష్కారం చేపట్టాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి 10అర్జీలు స్వీకరించారు. ఆర్డీవో సుస్మిత మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన భూహక్కులు, రికార్డులు, హద్దుల గుర్తింపు, పొజిషన్‌సర్టిఫికెట్‌లు జారీ వంటి వాటిని పారదర్శకంగా అందించాలన్నారు. ప్రతీ అర్జీని సమయపాలన ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు తమ అర్జీలను 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ద్వారా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

పంగిడి విద్యార్థుల సైన్స్ టూర్ విజయవంతం



సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొవ్వూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం పంగిడి జడ్పీ హైస్కూల్ విద్యార్థుల సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్ విజయవంతమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగిన శ్రీరామారావు తెలిపారు. రాష్ట్ర సమగ్రశిక్షా నిధులతో పాఠశాలలోని 120మంది విద్యార్థులను సోమవారం ధవళేశ్వరం కాటన్ మ్యూజియం, బొమ్మూరు సైన్స్‌పార్క్, సత్యదేవనర్సరీ, మహాకాళేశ్వరం, ఇస్కాన్ టెంపుల్ సందర్శించామన్నారు. ఉపాధ్యాయులు వి.వి.శాస్త్రి, రవికుమార్, అరుణకుమారి, కళావతి, లలిత, సుసన్నరాణి, రాజులమ్మ, శిరీష, రమాదేవిలు పాల్గొన్నారు.

'పాత్రికేయులు ఆరోగ్య పద్ధతులను పాటించాలి'

కొవ్వూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పాత్రికేయులు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని అన్నారు. ఇటీవల మృతి చెందిన పాత్రికేయుడు బోనగిరి అయ్యప్పకు సోమవారం కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅ తిథులుగా పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, పట్టణ సీఐ పి.విశ్వం, ఆర్యవైశ్య ప్రముఖులు మద్దుల సత్యనారాయణ, కొల్లేపర శ్రీనివాస్‌లు అయ్యప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సూరపనేని చిన్ని మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించే పాత్రికేయులు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్యవైశ్య ప్రముఖులు కొల్లేపర శ్రీనివాస్, అంజనీదేవిల ఆర్థిక సహకారంతో సుమారు 100 మంది పేదలకు అన్నదానం చేసి దుప్పట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి తోట అవినాష్, వీఆర్‌వీ ప్రసాద్, పుప్పాల సురేష్, శ్రీరంగం సత్యప్రసాద్, సున్నం శ్రీహరిబాబు, కెవెన్వీ సాయి, ఎ.సూర్యప్రకాష్, జి.రవి, గొర్రెల ఎర్రన్న, బొల్లిపో రామాంజనేయులు (బాను), నండూరి దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు, నాదెళ్ళ రామం, పొన్నాడ సుబ్రహ్మణ్యం, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

జనసైనికుడికి ఆర్థిక సాయం

దేవరపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో జనసేన పార్టీ ఎప్పుడూ ముందుంటుందని గోపాలపురం నియోజ కవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు అన్నారు. దేవరపల్లి మండలం సుబ్బరాయపురం గ్రామానికి చెందిన జనసైనికుడు ఉండ్రాజవరపు తరుణ్‌తేజ జీవనోపాధి నిమిత్తం లైటింగ్ పనికి వెళ్లగా విద్యుదాఘాతంతో అనారోగ్యానికి గురికావడంతో అతని కుటుంబానికి సోమవారం గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు, జనసేన నాయకులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనసేన అధ్యక్షుడు గుడిసే పోసివెంకటరత్నం, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, జనసేన నాయకులు పాండు, ఐనాల నరసింహమూర్తి, అనిశెట్టి ఆదిత్య, ఐనాల మణికంఠ, పసలపూడి రవిరాజు, చాపల జగ్గయ్య, చాపల దుర్గారావు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి క్రీడా పోటీలు

నిడదవోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం మున్సిపల్ వజ్రోత్సవ వేడుకలలో భాగంగా సచివాలయ సిబ్బందికి కేరమ్స్, షెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు వజ్రోత్సవ వేడుకలలో బహుమతులు అందజేయనున్నారు. ఈకా ర్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికార్లు పాల్గొన్నారు.



నిడదవోలులో షెటిల్ పోటీలలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది

డ్రైన్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



గోపాలపురంలో నిర్మిస్తున్న డ్రైన్‌పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పార్వతి

గోపాలపురం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ నిధులతో నిర్మిస్తున్న డ్రైన్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పార్వతి అన్నారు. గోపాలపురంలో 8చోట్ల నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణ పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎగువ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న వర్షంనీటి వలన గోపాలపురంలో 8చోట్ల లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. ముంపు నివారణ చర్యల్లో భాగంగానే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సూచనలతో డ్రైన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యా యన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బంగార య్య, టీడీపీ నాయకులు జ్యేష్ట శ్రీధర్, మద్దిపాటి రమేశ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమట శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

దివ్యాంగులకు టీషర్టులు అందజేత

చాగల్లు, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రమైన చాగల్లులోని భవిత కేంద్రంలోని దివ్యాంగులకు సోమవారం టీషర్టులను అందజేశారు. చాగల్లు నెలటూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అ ధ్యక్షుడు వీవీ రామారావు ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు టీషర్టులు పంపిణీ చేశారు. లయన్స్ సభ్యులు మాట్లాడుతూ దివ్యాంగులకు తగిన సహాయ సహకారాలు అందించడానికి లయన్స్‌క్లబ్ తరుపున కృషి చేస్తామన్నారు. సభ్యులు కె.అచ్యుతరామ ప్రసాద్, కె.నాగేశ్వరరావు, సూర్యప్రకాశరావు, ఆళ్ళ సత్తిబాబు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

దేవరపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో షష్ఠి మహోత్సవాల్లో భాగంగా శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంవద్ద సోమవా రం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 108 కళశాలు, విశేష ద్రవ్యాలతో స్వామి వారికి అభిషేకం, లక్ష్మీగణపతి, నవగ్రహ సుబ్రహ్మణ్యేశ్వర, సర్పసూక్త పాశుపత హోమం, పూర్ణహుతి, నీరాజన మంత్రపుష్పాలు, అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ నిర్వహించారు.

పారదర్శకత కోసమే మనడబ్బులు మన లెక్కలు

- డీఆర్‌డీఏ డీపీఎం సంపత్‌కుమార్



మండల పరిషత్ కార్యాలయంలో సీఏలకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌డీఏ డీపీఎం సంపత్‌కుమార్

గోపాలపురం, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): స్వయం సహాయక సంఘాల్లో మహిళలు జరుపుతున్న పొదుపు, అప్పులపై లావాదేవీలను పారదర్శకంగా తెలియజేయడం కోసమే మనడబ్బులు మన లెక్కలు యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని డీఆర్‌డీఏ డీపీఎం ఎం.సంపత్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మనడబ్బులు - మనలెక్కలు యాప్‌పై సీఏలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏపీఎం రోజ్‌మాణిక్యం ఆధ్వర్యంలో ఎంపీడీవో రాజమనోహర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న సీఏలను ఉద్దేశించి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది 2025 మార్చి 30నాటికి గతంలో పొదుపుసంఘాల ద్వారా జరిగిన అప్పులు, పొదుపుకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ యాప్‌లో ఆన్‌లైన్ చేస్తామన్నారు. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు ఈ యాప్‌ను వినియోగించి ప్రతీ మహిళా వ్యక్తిగత, గ్రూపు ద్వారా జరిపిన ఆర్థిక లావాదేవీలను స్మార్ట్ ఫోన్ ద్వారా క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. తన వ్యక్తిగత గ్రూపుకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు పొదుపుఖాతాలో ఉన్న ప్రతీ మహిళకు ఒక గుర్తింపు నెంబర్‌ను కేటాయిస్తామన్నారు. ఈయాప్‌పై స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు అవగాహన కల్పిం చేందుకు పది గ్రూపులకు ఒక్కటి చొప్పున ఈ-నారి ఏర్పాటుచేస్తామన్నారు. సమా వేశాలు జరుపుకునే నిర్ణీత ప్రదేశాలను జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. సమావేశం జరిగినప్పుడు పాల్గొన్న మహిళల సంఖ్యను ఈ యాప్ స్వయంగా లెక్కించి నమోదు చేస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో పొదుపు సంఘాల ఖాతాల్లో జరుగుతున్న మోసాలు అరికట్టేందుకు ప్రభుత్వం ఈయాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. శిక్షణ పొందిన సీఏలు పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాస్‌బాబు, సీసీలు కల్పవల్లి, వేణు, హుస్సేన్, గోపాలపురం, దేవరపల్లి మండలాల సీఏలు పాల్గొన్నారు.

NOTICE

My client **Pogiri Surya Kumari, W/o Pogiri Kondayya,** is the owner of the property located at R.S.No. 80/1, With Extent:- 94.34 sqr yrds, Door No.5-41/1, Dorayya Cherue Area Vemuluru village, which is the property of my client, vide Document, No.2018/2003, and which is Missing at the time of House shifiting So any one find it. Please contact wiht my client, finally, my client has decided to sell or transfer the said property. if anyone has any objections to the sell or transfer of the property with the above details, he can inform it to my client with her reference No.9985951899 within 24 hrs of the publication of this advertisement.

Kodavali Venkata Balaji
Advocate, Supreme Court of India

In the court of the Hon'ble Special Court for Trial and Disposal of Commercial Disputes at Vijayawada.
I.A. 107/2023 in C.O.S. 11/2020

Between: M/s. Unibait Feeds Pvt.Ltd.
Rep. by its Authorized Person, Gudivada - Petitioner
and
D.M.R. Aqua Feeds and Needs, Rep. by its Managing Partner, Mudunuri Srilakshmi - Respondants and 4 others

1st Respondant : D.M.R. Aqua Feeds and Needs, A. Regd. Partner Ship Firm rep. by its Managing Partner, Mudunuri Srilakshmi, W/o. Late Satyanarayana Raju, D.No.7-141, Youth Club road, Chinaamiram, Bhimavaram Rural Mandal, West Godavari District-534204.
2nd Respondant : Dandu Piramula Saikrishna Raju, S/o. Mohana Murali Krishnam Raju, working partner of D.M.R. Aqua Feeds and Needs, R/o. Manikodu Hamlet of Chataparru Gram Panchyat, Eluru Mandal, West Godavari Dist-534004.
3rd Respondant : Chekuri Ramanjaneya Raju, S/o. Maridi Raju, working Partner of D.M.R. Aqua Feeds and Needs, R/o. D.No. 1-8, Magam Inavalli Mandal, East Godavari District-533577.
4th Respondant : Dandu Mohana Murali Krishnam Raju, S/o. Satyanarayana Raju, R/o. Mandikodu Hamlet of Chataparru Gram Panchayat, Eluru Mandal, West Godavari-534004.
5th Respondant : Smt. Dandu Geeta, W/o. Mohana Murali Krishnamraju, R/o. Mondikodu, Hamlet Chataparru Gram Panchayat, Eluru Mandal, West Godavari District-534 004.

పై నెంబరు Petition ను Petitioner U/or-34 R-5(3) and U/Sec 151 of C.P.C ప్రకారము Final Decree Pass చేయమని కోరుచూ దాఖలు చేయగా, అందుపై Petition లో Respondants 1 to 5 లకు Notice ల నిమిత్తము శ్రీ కోర్టువారు ది. 08-12-2025నకు వాయిదాగా వేసి ఉన్నారు. కావున ఆ రోజు ఉ॥గం॥ 10.30 ని॥లకు Respondants 1 to 5 లు స్వయంగా కానీ, అడ్వకేట్ గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి Order ప్రకారము //

ఇట్లు
కె.వి.ఆర్.కె. రెడ్డి
పిటీషనర్ తరపు అడ్వకేట్, గుడివాడ
వాయిదా : 08-12-2025